


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 3 సంచిక: 235, పేజీలు - 09
శుక్రవారం, నవంబర్ 01, 2023 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

# “మార్పు” వచ్చేనా

## - చివర్లో మారిన లెక్కలు - ఓటింగ్‌లో ఏం తేల్చారు.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. పోలింగ్ శాతం భారీగా నమోదైనట్లు కనిపిస్తోంది. ఇంకా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నారు. ఈ సారి హైదరాబాద్ మినహా తెలంగాణలోని ఇతర జిల్లాల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. ఇదే సమయంలో ఈ సారి యువ పెద్ద ఎత్తున పోలింగ్ లో పాల్గొంది. వీరి ఓట్లతో పార్టీలు కోరుకుంటున్న “మార్పు” వస్తుందా. వీరి ఎవరికి వైపు మొగ్గ చూపారు. తెలంగాణలో ఎన్నికల ఫలితం ఏంటనేది ఉత్కంఠ పెంచుతోంది.

### హోరా హోరీ పోరు

ఈ సారి తెలంగాణ ఎన్నికల్లో హోరా హోరీ పోరు సాగింది. ప్రధాన పార్టీలు యువత..మహిళలను టార్గెట్ గా తమ హామీలు గుప్పించాయి. రాష్ట్రం మొత్తం ఓటర్లు 3,26,18,205 మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. వీరిలో 1,63,13,268 మంది పురుషులు కాగా, 1,63,02,261మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అందులో 18-19 ఏళ్లు ఉన్న ఓటర్లు - 9,99,667 ఉన్నారు. ఈ సారి ఓటు వేసేందుకు హైదరాబాద్ తో పాటుగా ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు తమ స్వస్థలాలకు చేరుకున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ - కాంగ్రెస్ - బీజేపీ మధ్య కొనసాగిన ముక్కోణపు పోటీలో వీరి ఓట్లు అధికారాన్ని డిసైడ్ చేయనున్నాయి. యువత ఓటింగ్ తమకే అనుకూలమని మూడు పార్టీలు ధీమాగా చెబుతున్నాయి.

### యువత మద్దతు ఎటు

ఈ సారి తెలంగాణలో ఉద్యోగ కల్పన, జాబ్ నోటిఫికేషన్లు యువత పైన ప్రధానంగా ప్రభావం చూపాయి. అదే సమయంలో తెలంగాణలో విస్తరించిన ఐటీ, ప్రయివేటు సంస్థల ఏర్పాటు కూడా ఉపాధికి దోహదం చేసింది. హైదరాబాద్ అభివృద్ధి బీఆర్ఎస్ ప్రధానంగా ప్రచారం చేసింది. భవిష్యత్ ఉండాలంటే తమకే ఓటు వేయాలని కోరింది. అయితే, హైదరాబాద్ లో స్థిర నివాసం ఉండే వారు మాత్రం ఓటింగ్ కు పెద్దగా ఆసక్తి చూపించలేదు. ఫలితంగా ఓటింగ్ శాతం తగ్గింది. జిల్లాల్లో ఉన్న యువత మాత్రం పెద్ద ఎత్తున పోలింగ్ లో పాల్గొన్నది. ఈ పోలింగ్ సరళి చూసిన వారు యువత సంక్షేమం కంటే తమకు మద్దతుగా నిలిచే పార్టీల వైపు ఆలోచన చేసినట్లు కనిపిస్తోంది. అందులో భాగంగా ఉద్యోగ కల్పనతో పాటుగా ఒక జాతీయ పార్టీకి అనూహ్యంగా టర్న్ అయినట్లు గ్రౌండ్ రిపోర్ట్స్ స్పష్టం చేస్తున్నాయి.

### ఓటింగ్ సరళి ఏం చెబుతోంది

ఇక, పోలింగ్ శాతం పెరిగితే ఎవరికి కలిసి వస్తుందనే లెక్కలు మొదలయ్యాయి. 2018 ఎన్నికల్లో 73.7 శాతం పోలింగ్ నమోదైంది. ఈ సారి అంతకంటే దాటుతుందని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. మెదక్ వంటి జిల్లాల్లో 90 శాతం వరకు పోలింగ్ చేరుకొనే అవకాశం కనిపిస్తోంది. గ్రామీణ నియోజవకర్గాల్లో భారీగా నమోదైన పోలింగ్ ఏ పార్టీకి కలిసి వస్తుందనేది ఇప్పుడు కీలకంగా మారుతోంది. కొత్తగా ఓటర్లుగా చేరిన యువత ప్రభావం వారి కుటుంబ సభ్యుల మీద కనిపించింది. ఎన్నికల సంఘం అధికారికంగా మధ్నాహ్నం 3 గంటల వరకు 52 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ప్రకటించింది. దీంతో ఇప్పుడు ఓటింగ్ సరళిపైన అన్ని పార్టీలు గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నా అసలు ఫలితాలు డిసెంబర్ 3న వెల్లడి కానున్నాయి.

# కాంగ్రెస్‌కు ఆ రెండు

## - బీజేపీకి ఈ రెండు

## - అక్కడ హంగ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఈ నెలలో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై గురువారం పలు మీడియా సంస్థలు, ఏజెన్సీలు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ప్రకటించాయి. ఇందులో కాంగ్రెస్, బీజేపీకి రెండేసి రాష్ట్రాల్లో ఆధిక్యం కట్టబెట్టాయి. మరో రాష్ట్రంలో మాత్రం హంగ్ అసెంబ్లీ వస్తుందని అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ 3వ తేదీన జరిగే కౌంటింగ్, అందులో వెలువడే ఫలితాలు ఆసక్తి పెంచేస్తున్నాయి. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలపైనా వీటి ప్రభావం పడనుంది. గురువారం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ లో తెలంగాణ ఎన్నికల్లో దాదాపు అన్ని సర్వే సంస్థలు కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యం కట్టబెట్టాయి. అన్ని ఎగ్జిట్ పోల్స్ సంస్థలూ కాంగ్రెస్ 50 నుంచి 80 సీట్ల మధ్య సాధించబోతున్నట్లు తేల్చిచెప్పేశాయి. అన్ని సర్వేల్లోనూ అధికార బీఆర్ఎస్ వెనుకబడింది. తెలంగాణలో కాంగ్రెస్ వేవ్ ఉన్నట్లు ఈ ఎగ్జిట్ పోల్ ఫలితాలను బట్టి తెలుస్తోంది. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ డిసెంబర్ 3న వెలువడే ఫలితాలపై భారీ ఆశలు పెట్టుకున్నాయి.
తెలంగాణ పొరుగున ఉన్న ఛత్తీస్ ఘడ్ లోనూ కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నట్లు ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించాయి. ఈ నెలలో జరిగిన ఛత్తీస్ ఘడ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ మరోసారి ఆధిక్యంలో నిలవబోతున్నట్లు

6లో ▶

# 70 సీట్లు తగ్గకుండా గెలుస్తాం

## - బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు - బీఆర్ఎస్ పార్టీదే విజయం అన్న కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** డిసెంబరు 3 ఫలితాల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమాగా చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్. 70 సీట్లకు తగ్గకుండా గెలుస్తాం అని మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారు అన్నారు. 2018 ఎగ్జిట్ పోల్స్‌లో ఒక్క సంస్థ మాత్రమే సరిగా చెప్పిందన్న కేటీఆర్ ఈ ఫలితాలు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. మళ్లీ అధికారం బీఆర్ఎస్ పార్టీదేనని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత తెలంగాణ భవన్ లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలు ముగియగానే పలు సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని వచ్చింది. తెలంగాణ ఎగ్జిట్ పోల్స్ ను మంత్రి కేటీఆర్ కొట్టిపారేశారు. ఇంకా ఓటింగ్ పూర్తికాలేదు,

6లో ▶

# నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద మరోసారి ఉద్రిక్తత

## - జేసీబీలతో చేరుకుంటున్న టీఎస్ పోలీసులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఏపీ పోలీసులు డ్యామ్ మీద 13 గేట్ల వరకు చేరుకుని ముళ్ల కంచె ఏర్పాటు చేసి అక్కడివరకు డ్యామ్ ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అయితే డ్యామ్ మీద ఏపీ పోలీసులు ఏర్పాటు చేసిన కంచె, బారికేడ్లను తొలగించేందుకు తెలంగాణ పోలీసులు కౌంటర్ చర్యలు చేపట్టారు. సంబంధిత జిల్లా పోలీసులు జేసీబీలతో సాగర్ డ్యామ్ వద్దకు చేరుకుంటున్నారని సమాచారం. ఏపీ పోలీసుల చర్యలకు, ప్రతిచర్యగా

6లో ▶

# డిసెంబర్ 12వ తేదీకి చంద్రబాబు కేసు వాయిదా

## - క్వాష్ పిటిషన్‌పై తీర్పు ప్రాసెస్‌లో ఉందన్న సుప్రీంకోర్టు



**అమరావతి / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఫైబర్ నెట్ స్కాంలో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో మరోసారి విచారణ వాయిదా పడింది. గత విచారణ సమయంలో చంద్రబాబు దాఖలు చేసుకున్న క్వాష్ పిటిషన్ పై తీర్పు తర్వాత విచారణ చేస్తామని తెలిపామని ఆ తీర్పు ప్రాసెస్ లో ఉన్నందున విచారణను వాయిదా వేస్తున్నామని జస్టిస్ అనిరుద్ధబోస్ ధర్మాసనం తెలిపింది. క్వాష్ పిటిషన్ పై తీర్పు డిసెంబర్ పన్నెండో తేదీ లోపు వస్తుందని భావిస్తున్నారు.

### క్వాష్ పిటిషన్ పై తీర్పు అక్టోబర్ 18వ తేదీన రిజర్వ్

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో టీడీపీ చీఫ్ చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై తీర్పును సుప్రీం కోర్టు అక్టోబర్ 18వ తేదీన రిజర్వ్ చేసింది. అప్పటి నుంచి తీర్పు పెండింగ్ లో ఉంది. గత విచారణ సమయంలో చంద్రబాబు దాఖలు చేసుకున్న క్వాష్ పిటిషన్ పై తీర్పు తర్వాత విచారణ చేస్తామని తెలిపామని ఆ తీర్పు ప్రాసెస్ లో ఉన్నందున విచారణను వాయిదా వేస్తున్నామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. పన్నెండో తేదీకి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. క్వాష్ పిటిషన్ పై తీర్పు డిసెంబర్ పన్నెండో తేదీ లోపు వస్తుందని భావిస్తున్నారు.

### చంద్రబాబు పిటిషన్లపై విచారణల్లో వరుస వాయిదాలు

చంద్రబాబుపై ప్రభుత్వం పెట్టిన

6లో ▶

# కేసీఆర్‌ను ఓడగొట్టినందుకు ధన్యవాదాలు

## - ఇదీ శ్రీకాంతాచారికి నివాళి అన్న రేవంత్ రెడ్డి

- తెలంగాణలో ఇక అందరికీ స్వేచ్ఛ లభించింది
- చంద్రుడికి మబ్బులు పట్టాయి
- ఇక సంబరాలు చేసుకోండి
- పోలింగ్ అనంతరం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఎన్నికలు పూర్తయిన తర్వాత విడుదలైన ఎగ్జిట్ పోల్స్ అన్ని కూడా కాంగ్రెస్ పార్టీకి మంచి మెజార్టీ వస్తుందనే తేల్చాయని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇక, డిసెంబరు 3న ప్రజల తెలంగాణ ఆవిష్కృతమవుతుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణకు పదేళ్లుగా పట్టిన పీడ తొలగిపోనుందన్నారు. ఓటమి ఖాయమని తెలిసినప్పుడే కేసీఆర్ నియోజకవర్గం మార్చారని ఆరోపించారు రేవంత్. ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో రేవంత్ మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కోసం కష్టపడిన కార్యకర్తలందరికీ రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ చైతన్యవంతమైందని కామారెడ్డి ప్రజలు నిరూపించారన్నారు. తెలంగాణ ఉద్యమంలో డిసెంబరు 3కు ప్రత్యేక స్థానం ఉందని ఆరోజే శ్రీకాంత్‌చారి తుదిశ్వాస విడిచారన్నారు. శ్రీకాంత్‌చారి ఘటనతోనే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందని రేవంత్ గుర్తు చేశారు. డిసెంబరు 3న దొరల తెలంగాణ అంతమై ప్రజల తెలంగాణ విష్కృతమవుతుందని రేవంత్ జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చైతన్యం మీద తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీకు 25 కంటే ఒక్క సీటు కూడా దాటదని సునామీ వస్తే గడ్డపారలే కొట్టుకుపోతాయి గడ్డిపోచ ఓ లెక్కా అంటూ రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

6లో ▶

# తెలంగాణలో మొత్తంగా 70.60 శాతం పోలింగ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. తెలంగాణలో రాష్ట్ర వ్యాప్తంగా 70.60 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. 5 గంటలలోపు క్యూలో నిలబడి ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. గురువారం (నవంబరు 30) రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటలకు మొదలైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటల వరకూ సాగింది. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 13 నియోజకవర్గాల్లో మాత్రం పోలింగ్ ను గంట ముందు సాయంత్రం 4 గంటలకే ముగించారు.

### ఈ ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకే ముగింపు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా ఎన్నికల సంఘం గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. కేవలం 13 ప్రాంతాల వారికి మాత్రం సాయంత్రం 4 గంటల వరకే ఓటు వేసే అవకాశం ఉంటుంది. సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం,

6లో ▶

# తెలంగాణలో కర్ణాటక సీన్ రిపీట్ అవుతుందా.?

## - అక్కడ బీజేపీ, ఇక్కడ బీఆర్ఎస్.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తెలంగాణలో అధికార భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీకి కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతాయనే వార్తలు వినిపిస్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటక నిర్ణయాత్మక అంశంగా ఆవిర్భవించడం ఆశ్చర్యకరమైన రాజకీయ పరిణామాలకు దారితీసింది. తెలంగాణలో అధికార బీఆర్ఎస్ పార్టీని గద్దె దించాలని

6లో ▶

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర





శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం సైబరాబాద్ పోలీస్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర,సైబరాబాద్ పరిధిలోని,నానక్ రాంగూడ, గౌలిదొడ్డి, గోపన్ పల్లి తాండ, హఫీజ్ పేట్, పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.మాదాపూర్ జోన్ లో కీపీహెచ్బీ కాలనీ లోని మలేషియన్ టౌన్ షిప్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని,జెడ్పిహెచ్ఎస్, నానక్ రాంగూడ ఎంపిపిఎస్, గౌలిదొడ్డి ఎంపిపిఎస్, హాఫీజ్ పేట్ లోని న్యూ ఆదిత్యా నగర్ లో ఉన్న హెూలీ హై స్కూల్, గోపన్ పల్లి తాండ లోని ఎంఎంపిఎస్, జగద్గిరిగుట్ట లోని సీఎమ్ఆర్ మోడల్ హై స్కూల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.సీపీ సైబరాబాద్ లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లోని పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న క్యూఆర్టీ వాహనాలకు అమర్చిన జిఐఎస్ వ్యవస్థ నుంచి రియల్ టైమ్ లొకేషన్ ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించారు.సీపీ తో పాటు మాదాపూర్ డీసీపీ సందీప్, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ మాదాపూర్ శ్రీనివాస్, ఏసీపీ బాలానగర్ గంగారాం, బాచుపల్లి ఇన్ స్పెక్టర్ సుమన్, జీడిమెట్ల ఇన్ స్పెక్టర్ పవన్, గచ్చిబౌలి ఇన్ స్పెక్టర్ జేమ్స్ బాబు, కీపీహెచ్ బి ఇన్ స్పెక్టర్ వెంకటేశ్ ఇన్ స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

# మల్లన్న సన్నిధిలో ఉచిత సామూహిక సేవలు.

**దర్శనానంతరం భక్తులందరికీ దేవస్థానం అన్నపూర్ణభవనం నందు భోజన సదుపాయం కూడా కల్పించబడింది.**

**సేవలలో భాగంగా శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) ధర్మప్రచారంలో భాగంగా దేవస్థానం ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత సామూహిక సేవలలో భాగంగా శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించింది.




తెల్లరేషన్కార్డు కలిగిన వారి సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఉచిత సామూహికసేవలలో భాగంగా చంద్రవతి కల్యాణ మండపంలో ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహించడం జరిగింది.కాగా ఈ ఉచిత సేవకై ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకున్న భక్తులచేత సామూహిక కల్యాణోత్సవాన్ని జరిపించబడింది.కార్యక్రమములో ఆలయ అధ్యాపక ఎం. పూర్ణానందం, అర్చకస్వాములు, సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సామూహిక కల్యాణోత్సవం లో ముందుగా భక్తులందరి గోత్రనామాలతో సంకల్పం జరిపించబడింది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడింది.కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీస్వామివార్ల దర్శనం కల్పించబడింది. స్వామివారి దర్శనానంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.సేవాకర్తలకు 2 లడ్డు ప్రసాదాలు, కైలాసకంకణాలు అందజేయబడ్డాయి.దర్శనానంతరం భక్తులందరికీ దేవస్థానం అన్నపూర్ణభవనం నందు భోజన సదుపాయం కూడా కల్పించబడింది.కాగా జరిగిన సామూహిక కల్యాణోత్సవంలో స్థానికులే కాకుండా మార్కాపురం, చిత్తూరు, గుంటూరు తదితర ప్రాంతాలకు చెందిన వారు కూడా పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా వివేకానంద నగర్ లోని క్లబ్ హౌస్ లోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీ. ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ పార్టీ అభ్యర్థి రవికుమార్ యాదవ్ బిక్షపతి యాదవ్



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) ఎన్నికల సందర్భంగా కొండాపూర్ మసీద్ బండ కమ్యూనిటీ హాల్ లో ఓటు హక్కు వినియోగించుకున్న భారతీయ జనతా పార్టీ అభ్యర్థి రవికుమార్ యాదవ్. మాజీ శాసనసభ్యులు బిక్షపతి యాదవ్.

# కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ సీనియర్ ఐపీఎస్ అధికారి, టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొండాపూర్ చిరాక్ పబ్లిక్ స్కూల్ లోని 375వ పోలింగ్ బూత్ లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని ఓటు హక్కు చాటుతుందన్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లందరూ పాల్గొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా యువత, విద్యావంతులు ఓటు వేయడాన్ని తమ బాధ్యతగా భావించి పోలింగ్ లో పాల్గొనాలని అన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికలు






శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. నియోజకవర్గ పరిధిలోని మొత్తం 638 పోలింగ్ స్టేషన్లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా సుమారు 49 శాతం మంది ఓటర్లు ఓటు వేశారు. ఇది గత 2018 ఎన్నికలతో పోలిస్తే కేవలం 0.4శాతం మాత్రమే పెరిగిందని చెప్పాలి. ఈసారి ఓటింగ్ శాతం పెరుగుతుందని అధికారులు ఆశించినా ఫలితం లేకుండా పోయింది. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా అక్కడక్కడ చిన్న చిన్న ఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర సైబరాబాద్ వ్యాప్తంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఎన్నికల సరళిని, శాంతిభద్రతలను పరిశీలించారు.

# ప్రశాంతం గా ముగిసిన శాసనసభ ఎన్నికలు



వాజేడు (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్టంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుందటంతో వాజేడు మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.వాజేడు మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడం కొరకు సివిల్ పోలీసులు, సిఆర్పిఎఫ్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.వాజేడు మండలంలో ఎన్నికలు జరుగుతుండడంతో వాజేడు మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రావుల్ చంద్రవర్మ, ఆర్ఐ రాజు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ఎలక్షన్ బూత్ లను సందర్శించి ప్రశాంతంగా జరిగే టట్టు సమన్వయంతో జరిపించారు.

# శ్రీశైల క్షేత్రం లో నిత్య అన్నదాన వితరణ కు రూ, లక్ష విరాళం

**దాతకు బాండు అందజేస్తున్న ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్ ) శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదానికి, బాపట్ల వాస్తవ్యులు పి. సందీప్ 1,00,000/- విరాళాన్ని ఆలయ సహాయ కార్యిర్వహణాధికారి ఫణీంద్ర ప్రసాద్ కు అందజేశారు. దాతకు స్వామి అమ్మవార్ల దర్శనం దేవస్థానం తరపున స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు లడ్డూ ప్రసాదం అందజేశారు.

## బండారి లక్ష్మారెడ్డి 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తారు : కోండ్రం పల్లి గిరిబాబు



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోండ్రం పల్లి గిరిబాబు అన్నారు.గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ 9 సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి పనులను గుర్తించిన ప్రజలు మరోసారి బిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టడానికి సిద్ధమయ్యారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని, బిఎల్ఆర్ చేసిన సేవా కార్యక్రమాలు, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడంలో ముందుండే నాయకుడు బి ఎల్ ఆర్ కు నియోజకవర్గ ప్రజలు ఓటు వేసి తమ మద్దతు తెలిపారని,ఈ ఎన్నికల్లో బండారి లక్ష్మారెడ్డి విజయం తధ్యమని ఈ సందర్భంగా గిరిబాబు అన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్ జెండర్లు

**వరంగల్ తూర్పు నియోజవర్గంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్న ట్రాన్సజెండర్ లు**



వరంగల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రం లో పోలింగ్ డే మాకు పండగ రోజులాగా ఉంది .మాకు ఎ ప్రభుత్వాలు, ఏ పార్టీలు పట్టించుకోకపోయినా రాజ్యాంగం కల్పించిన హక్కుగా ఈరోజు మేము ఓటు హక్కును వినియోగించుకున్నాము అని ఏ ప్రభుత్వాలు అయిన ఏ పార్టీ అయినా సంక్షేమ పథకాలలో మాకు ప్రత్యేకంగా కల్పించలేదు అని ఎవరైతే తమ సమస్యల గురించి పట్టించుకోని తమ భవిష్యత్తు వారి పిల్లల భవిష్యత్తు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తమకున్న వజ్రాయుధం ఓటు హక్కును స్వచ్ఛందంగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ట్రాన్స్ జెండర్లు ఓటు హక్కును వినియోగించుకున్నామని వారు అన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న పోలీస్ బాస్

**- జూబ్లీహిల్స్'లో ఓటు హక్కు వినియోగించుకున్న తాజా మాజీ సీపీ**

**- ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యత అన్న సత్యనారాయణ**

**- ఇటీవలే నిజామాబాద్ సీపీగా పనిచేసిన ఉన్నతాధికారి**



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ ) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిజామాబాద్ తాజా మాజీ పోలీస్ కమిషనర్ వీ.సత్యనారాయణ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు జూబ్లీ హిల్స్'లోని భారతీయ విద్యాభవన్ పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు ఉత్సాహంగా ముందుకు రావాలని సూచనలు చేశారు. ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యతని స్పష్టం చేశారు. అందులో భాగంగానే రాష్ట్రంలో పోలింగ్ శాతం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు యువత, మహిళలు పెద్ద ఎత్తున ఎన్నికల్లో భాగంగా పోలింగ్ చేయాలని పిలుపునిచ్చారు.

# ఉప్పల్ నియోజకవర్గం పై గులాబీ జెండా ఎగరడం ఖాయం

## తెలంగాణ రాష్ట ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేయడం ఖాయం

## ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడంలో బండారి లక్ష్మారెడ్డి ని మించిన నాయకుడు లేరు

కాప్రా (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా చరిత్రపుటల్లో కేసీఆర్ పేరు నిలిచిపోతుందని, ఉప్పల్ నియోజకవర్గం ప్రజలు బండారి లక్ష్మారెడ్డి కి భారీ మెజార్టీ అందించడం ఖాయమని, ఉప్పల్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని, ఉప్పల్ నియోజకవర్గ ఓటర్లు చర్చించుకోవడం చూస్తుంటే డిసెంబర్ మూడవ తారీకు బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే నాయకుడిగా చరిత్ర సృష్టిస్తాడని, భారీ మెజార్టీని నియోజకవర్గ ప్రజలు కట్టబెట్టడం ఖాయమని, కాంగ్రెస్, బిజెపి, పార్టీలు ఒకటి రెండవ స్థానాలకు పోటీలో ఉండడం ఖాయమని, బిజెపి పార్టీ అభ్యర్థి ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ కు ఈసారి కూడా డిపాజిట్లు దక్కడం కష్టమే అనిపిస్తుందని నియోజకవర్గ ప్రజలు గుసగుసలు పెడుతున్నారు.

బిజెపి అభ్యర్థిగా ఎన్ఎస్ఎస్ ప్రభాకర్ ని అధిష్టానం ప్రకటించిన తర్వాత నియోజకవర్గ ప్రజల్ని కలుసుకున్న దాఖనాలు లేవని, పాదయాత్రల ద్వారా నియోజకవర్గ ప్రజల్ని ఎక్కడ కూడా కలవలేదని, నామమాత్రంగా మాత్రమే పాదయాత్ర నిర్వహించి తాను అభ్యర్థిగా ఉన్నానని ప్రచారం చేసుకున్నాడు తప్ప పోటీలో నిలబడి గెలవాలన్న కసి ఎక్కడ ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ చూపలేదని, కార్యకర్తలను పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా లేవని, కార్యకర్తలు బిజెపి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అధిష్టానం మాట కాదనలేక పార్టీకి పనిచేశారే తప్ప ప్రభాకర్ అనే వ్యక్తికి కాదని, ప్రభాకర్ తప్ప నియోజకవర్గంలో వేరే అభ్యర్థికి ఉప్పల్ నియోజకవర్గ టికెట్ ఇస్తే పోటీ రసవత్తరంగా ఉండేదని ఇప్పుడు పోటీ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ మధ్య ఉన్నదని, తనకు కాదని నియోజకవర్గంలో ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీకి నష్టం జరుగుతుందన్న భావనతో మాత్రమే ఎన్ వి ఎస్ ఎస్ కు పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వడం జరిగిందని, తాను తప్ప నియోజకవర్గంలో పోటీ చేసే నాయకుడే లేడా అని కార్యకర్తలు మాట్లాడుకోవడం చూస్తుంటే పార్టీ గురించి కష్టపడ్డా ఫలితం లేకుండా పోతుందని పార్టీని నమ్ముకుని పార్టీకి సేవ చేసే మాలాంటి ఆర్ఎస్ఎస్ బిజెపి కార్యకర్తలను నట్టేట అధిష్టానం ముంచిందని మరోసారి డిపాజిట్లు బిజెపి అభ్యర్థికి రాకపోతే ఉప్పల్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ ప్రశ్నార్థకంగా మారుతుందని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసే అభ్యర్థికి ఉప్పల్ నియోజకవర్గంలో పరిస్థితులు దారుణంగా ఉంటాయని, ఇప్పటికైనా అధిష్టానం ఉప్పల్ నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కార్యకర్తలను పట్టించుకునే నాయకత్వం రావాలని కార్యకర్తలు కోరుకోవడం మాట్లాడుకోవడం చూస్తుంటే ఉప్పల్ నియోజకవర్గంలో బిజెపి పార్టీకి కష్టకాలం తప్పదని పిస్తుందని బిజెపి పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుకోవడం చర్చనీయంగా మారింది,

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పరమేశ్వర్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించాక నాయకులు పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోవడంతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి గందరగోళంలో పడిందని, ఉప్పల్లో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయిందని, అధిష్టానం గుర్తించే పీసీసీ నుంచి ఉప్పల్ నియోజకవర్గానికి ప్రచారానికి నాయకులు రాలేదని రేవంత్ రెడ్డి తన వాడని పరమేశ్వర్ రెడ్డికి టికెట్ ఇప్పించుకోవడంలో రేవంత్ రెడ్డి పాత్ర ముఖ్యంగా ఉన్నదని అతను కూడా ప్రచారానికి రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిరుత్సాహాన్ని గురై చేతులెత్తేసారని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అభ్యర్థిని ప్రకటించాక ఉప్పల్ నియోజకవర్గంలో బలంగా ఉండే కాంగ్రెస్ పార్టీ బలహీన పడిందని పరమేశ్వర్ రెడ్డి ఒక్కడే నియోజకవర్గాన్ని చుట్టి ప్రచారం చేసుకోవడం అధిష్టానం నుంచి ఎవరూ కూడా ప్రచారానికి రాకపోవడం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్లో ఓడిపోతదన్న సమాచారంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించలేదని కార్యకర్తలు మనోవేదనకు గురయ్యారని, ఎంతో బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ బలహీనపడడానికి కారణం అధిష్టానం టిక్కెట్టు విషయంలో తప్పు చేసిందని లేకపోతే నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉండేదని టికెట్ కేటాయించాక కాంగ్రెస్ పార్టీ బలహీన



పడిందని జరిగిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ వెనకంచలో ఉన్నదని, ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విజయం తథ్యమని ప్రజలు గుసగుసలు పెడుతున్నారు.

డిసెంబర్ మూడో తారీకు జరిగే ఓట్ల లెక్కింపులో ఉప్పల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎవరు గెలుపొందుతారో, చూడాలని ఏది ఏమైనా బండారి లక్ష్మారెడ్డి విజయం తథ్యమని ప్రజలు చర్చించుకోవడం ఆశ్చర్యానికి గురివేసింది, రాష్ట్రంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వస్తుందని ముఖ్యమంత్రిగా చంద్రశేఖర్ రావు హ్యాట్రిక్ విజయం సాధించి చరిత్రలో నిలుస్తాడని తెలంగాణ సాధించిన ముఖ్యమంత్రిగా మరోసారి చరిత్ర పుటల్లో నిలవడం ఖాయమని నియోజకవర్గ ప్రజలు గుసగుసలు పెడుతున్నారు.

# ఎన్నికల సరళిని పరిశీలించిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ నియోజకవర్గం ఎన్నికల సరళని బూత్ స్థాయి నాయకులతో కలిసి పరిశీలించిన ఉప్పల్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి హబ్సిగూడ డివిజన్లో వెంకట్ రెడ్డి



నగర్, నవరంగూడ, రామ్ రెడ్డి నగర్, శ్రీనివాసపురం, ఆర్టీసీ కాలనీ, తదితర కాలనీలలో ఎన్నికల సరళని బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. అనంతరం బిఎల్ఆర్ మాట్లాడుతూ మూడోసారి ముఖ్యమంత్రి గా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారని హ్యాట్రిక్ ముఖ్యమంత్రి గా చరిత్ర సృష్టిస్తారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలు ఆదరించి బిఆర్ఎస్ పార్టీ కి పట్టం కట్టడం ఖాయమని ఈ సందర్భంగా బండారు లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బి.వి. చారి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, నరేందర్ రాజు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, చిన్న, నాగుల శ్రీనివాస్,గణేష్, అక్బర్, సంపత్, తదితరులు అభ్యర్థి వెంట కాలనీలలో పర్యటించారు.

## దివ్యాంగులు, వయో వృద్ధుల పై

# జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ

### సులభంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీల్ చైర్, ర్యాంప్ ఏర్పాటు







సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన దివ్యాంగులు వయోవృద్ధులపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.

అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీల్ చైర్, ర్యాంప్ ఏర్పాటు చేసింది. పోలింగ్ కేంద్రానికి వచ్చిన వెంటనే వారికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వీల్ చైర్ లో సహాయకులు వారిని పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్ళారు. వారు ఓటు వేసిన అనంతరం తిరిగి వారిని తాము వెళ్లే వాహనం వద్దకు వీల్ చైర్ లో తీసుకువచ్చారు. ర్యాంపు సౌకర్యం కూడా కల్పించారు. అలాగే ఓటర్ల కోసం త్రాగునీటి వసతి తో పాటు, నీడ కోసం టెంట్ లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయడంతో ఓటర్లు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వస్తున్న వృద్ధులకు సహాయంగా నిలిచిన పోలీస్ యంత్రాంగం.

# దక్షిణ భారతంలోనే

## కేసీఆర్ తొలి హ్యాట్రిక్ సీఎం : ముఠా గోపాల్

### రాష్ట వ్యాప్తంగా కారు ప్రభంజనం ఉందన్న బీఆర్ఎస్ అభ్యర్థి

### తెలంగాణలో మళ్లీ వచ్చేది గులాబీ ప్రభుత్వమేనన్న సిట్టింగ్ ఎమ్మెల్యే

### ముషీరాబాద్'లోనూ కారు గుర్తుదే గెలుపు అంటున్న గోపాల్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దక్షిణ భారతదేశంలోనే తొలి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ సరికొత్త చరిత్ర సృష్టించనున్నారని ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ధీమా వ్యక్తం చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న ముఠా గోపాల్,



అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో అన్ని వర్గాల మద్ధతు తనకే ఉందని, మరోసారి గెలవబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈసారి 50వేల మెజారిటీ వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

### కారుదే జోరు : గోపాల్

రాష్ట్ర వ్యాప్తంగా కారు ప్రభంజనం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీలోనూ కారు గుర్తుదే హవా అన్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలో మరోసారి వచ్చేది గులాబీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గాంధీ నగర్ డివిజన్ మాజీ కార్పోరేటర్ ముఠా పద్మ, బీఆర్ఎస్ నేత ముఠా నరేశ్, పార్టీ నేతలు ముచ్చకుర్తి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో లాఠీ చార్జ్

**రంగారెడ్డి** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజవర్గంలో,105 సెంటర్ లో మాక్ పోలింగ్ ప్రారంభం కాకపోవడంతో ఏజెంట్ల ల లో సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. ఉదయం 8:30 వరకు ఈవీఎంలు పనిచేయలేదు. దీంతో క్యూలో ఉన్న ఓటర్లు, ఆందోళన చేశారు. పోలింగ్ సెంటర్ వద్ద సమీపంలో, కాంగ్రెస్ బిఆర్ఎస్, కార్యకర్తలు గుమ్మి గుట్టడంతో, పార్టీ గుర్తులు చూపిస్తూ ప్రచారం చేసే క్రమంలో, పోలీసులు లాఠీచార్జ్ చేశారు, ఘటన స్థలం నుండి, దూరంగా వెళ్లిపోయారు, అధికార పార్టీ వాళ్ళని మాత్రం వదిలిపెట్టి మాపై లాఠీ చార్జ్ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు

## ఓటు హక్కును బహిష్కరించిన గిరిజనులు

### - డబ్బులు ఇవ్వడంలేదని ఓటర్ల ఆందోళన

**భద్రాద్రి/సూర్యాపేట** ఏన్కూర్ మండలం కొత్త మేడేపల్లి గ్రామంలో రహదారులు త్రాగునీటి సౌకర్యం మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదని ఆదివాసి గిరిజనులు నిరసనకు దిగారు. తమ మస్య పరిష్కరించేంతవరకు ఓటు వేయమని తెగేసి చెప్పారు.మరోవైపు డబ్బులు ఇవ్వడంలేదని ఓటర్లు ఆందోళనకు దిగారు. పోలింగ్ నేపథ్యంలో సూర్యాపేట-జమ్మిగడ్డలో కొందరు ఓటర్లు ఆందోళన చేపట్టారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, డబ్బులు ఇవ్వడం లేదని నిరసనకు దిగారు. పక్క వీధుల్లో ఓటర్ల కోసం డబ్బులు ఇస్తుంటే తమ వీధుల్లో పార్టీల నాయకులు మనీ పంచడం లేదని వాపోయారు. 'మా ఓట్లు పార్టీలకు అవసరం లేదా?' అంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.

# సాగర్‌లో ఉద్రిక్తత

**నాగార్జున సాగర్** తెలంగాణలో రాష్ట్రంలో ఎన్నికల జరుగుతున్నరోజు నాగార్జునసాగర్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. కుడి కాలువనుంచి నీరు విడుదల చేయడానికి ఏపీ అధికారులు, పోలీసులు సాగర్ దగ్గరకు చేరుకున్నారు. ప్రాజెక్టుకు ఉన్న 26 గేట్లలో సగభాగమైన 13వ గేట్ వరకు తమ పరిధిలోకి వస్తుందని చెబుతూ 500 మంది పోలీసులతో కలిసి వచ్చిన ఆ శాఖ ఉన్నతాధికారులు తమను అడ్డుకున్న డ్యామ్ సిబ్బందిపై దాడిచేశారు. వారి మొబైల్ ఫోన్లతోపాటు అక్కడి సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం 13వ గేట్ వరకు ముళ్లకంచె ఏర్పాటు చేసి డ్యామ్ను తమ అధీనంలోకి తీసుకున్నారు.నాగార్జున సాగర్ గొడవపై తెలంగాణ ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్ రాజకీయ నేతలకు కీలక సూచన చేశారు. ఈ గొడవ విషయం పోలీసులకు వదిలివేయాలని, వాళ్లే చూసుకుంటారని చెప్పారు. ఏ పార్టీకి చెందిన నేతలైనా సరే దీనిపై ఎవరూ ఏమీ మాట్లాడవద్దని హెచ్చరించారు

# జనగామలో లాఠీ చార్జ్

**జనగామ** జనగామ పట్టణంలోని ,245, 246 పోలింగ్ కేంద్రాల దగ్గర బిఆర్ఎస్, కాంగ్రెస్, సిపిఐ ,బిజెపి పార్టీల, మధ్య ఘర్షణ జరగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలని చెదరగొట్టడానికి లాఠి చార్జ్ చేసారు. పోలింగ్ కేంద్రంలోకి సంబంధం లేని వాళ్ళు వస్తున్నారంటూ కాంగ్రెస్ బిజెపి, సిపిఎం ,పార్టీ నాయకుల ఆరోపణ. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తను ఇతర పార్టీల కార్యకర్తలు నేతలు చితక్కోట్టారు.

## వనమా వెంకటేశ్వరరావు ఇంటిని

# చుట్టూ ముట్టిన మహిళలు

**భద్రాద్రి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటిని స్థానిక మహిళలు చుట్టుముట్టారు.

అన్ని కాలనీల్లో డబ్బులు పంచి తమకు డబ్బులు ఇవ్వలేదని వాగ్వాదానికి దిగారు. తమకు సైతం డబ్బులు అందించాలని ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు చేరుకొని ఆందోళనకారులను నచ్చజెప్పి పంపించారు..

## ఎమ్మెల్యే కందాలను అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు

**ఖమ్మం** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో కూసుమంచి మండలంలో పాలేరు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి పరాభవం ఎదురయింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రం వద్ద ఘటన జరిగింది. 184,185,186,187 బూతులలోకి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కందాల ఉపేందర్రెడ్డి పోలింగ్ బూతులోకి ప్రచారం చేయడంతో కాంగ్రెస్ పార్టీ వర్గీయులు నిలదీసారు. గో బ్యాక్ ఎమ్మెల్యే అంటూ నినాదాలు చేసారు.

పోలింగ్ కేంద్రాల లో కి వెళ్ళి "ఈవిఎం ల దగ్గరకు వెళ్లి ఓటర్లను ప్రలోభాల గురిచేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు ఆందోళన చేసారు. పోలింగ్ కేంద్రాల నుండి ఉపేందర్ రెడ్డి బయటకు రావడంతో

కొంతమంది కార్యకర్తలు జై కందాల అంటూ నినాదాలు పోటాపోటీ నినాదాలు చేసారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జై శీనన్న జై శీనన్న అంటూ నినాదాలు చేసారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి అదుపులోకి తీసుకొచ్చారు.

## సాగర్‌కు పోలీసులను
# పంపడం తప్పు

**గుంటూరు** నాగార్జున సాగర్ వద్దకు పోలీసులను పంపడంపై భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తీవ్రంగా తప్పుపట్టారు.
నాలుగున్నరేళ్లుగా పట్టించుకోకుండా... ఇప్పుడు హడావుడి ఎందుకని ఆమె నిలదీశారు. కరవు విషయంలోనూ ప్రభుత్వ తీరుపై పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టీడీపీ ఓట్లను తొలగిస్తున్నారు

**అనంతపురం** టీడీపీ సానుభూతిపరులే లక్ష్యంగా వైసీపీ నాయకులు ఓట్లను తొలగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మండిపడ్డారు.ఈ మేరకూ అనంతపురంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.వైసీపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయి, వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించడంతో పాటు దొంగ ఓట్లను ఎక్కించేందుకు భారీగా కుట్ర చేస్తోందన్నారు. ఓట్లను జబ్లింగ్ చేస్తూ ఇంటిలోని కుటుంబ సభ్యుల ఓట్లను ఓ పోలింగ్ కేంద్రంలో, కుటుంబ పెద్దది వేరే పోలింగ్ కేంద్రానికి మారుస్తూ గందరగోళ పరిస్థితిని సృష్టిస్తున్నారన్నారు. అనంత అర్బన పరిధిలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రోద్భలంతో ఒక్కో పోలింగ్ కేంద్రంలో టీడీపీకి చెందిన 30 ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు.

# యువగళం ఒక కామెడీ షో

**గుంటూరు** టీడీపీ నేత లోకేష్ పై తీవ్ర విమర్శలు చేశారు జన వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు. లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రపై సెటైర్లు వేశారు.లోకేష్ రాజకీయాలకు పనికిరాని వ్యక్తి అని అన్నారు. లోకేష్ ను ముఖ్యమంత్రిని చేయడానికి చంద్రబాబు , పవన్ కళ్యాణ్ తాపత్రయం పడుతున్నారని పేర్కొన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర ఒక కామెడీ షో అని అన్నారు. లోకేష్ గురించి మా స్థాయి నాయకులు మాట్లాడటం సిగ్గుపడాలి అంటూ ఎద్దేవా చేశారులోకేష్ కు బుర్రలో ఏముందో నోటితో చెప్పలేని పరిస్థితి అని పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్ర తోటే తెలుగుదేశం సర్వనాశనం అవుతుందని అంబటి విమర్శించారు. పోలవరంపై రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు అంబటి.. పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు ప్రారంభమవుతుందో నేను చెప్పలేను నేను జ్యోతిష్యుని కాను అని వ్యాఖ్యానించారు.

## పలు చోట్ల ఈవీఎంల
# మొరాయింపు అధికారులలో టెన్షన్

**కొడంగల్ :** రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్న వేళ పలు చోట్ల ఈవీఎంలమొరాయింపు అధికారులను టెన్షన్ పెడుతోంది. తాజాగా కొడంగల్ యోజకవర్గంలో ఓ ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.వికారాబాద్ జిల్లా బొమ్రాస్ పేట మండలంలోని తుంకిమెట్ల 194 పోలింగ్ స్టేషన్లో అరగంటకుపైగా ఈవీఎం మొరాయిస్తోంది. దీంతో పోలింగ్ నిలిచిపోయింది. క్యూలైన్లో నిల్చోవడంపై పలువురు అసహనంగా ఉన్నారు. త్వరగా సమస్య పరిష్కరించి పోలింగ్ మళ్లీ ప్రారంభించాలని కోరుతున్నారు.
**ఆసిఫాబాద్‌లో సైతం..** అసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ నంబర్ 189 లో రెండు గంటలుగా ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ నిలిచిపోయింది. అలాగే కాగజ్ నగర్ పోలింగ్ బూత్ నంబర్ 63లో కూడా సాంకేతిక సమస్యతో రెండు గంటలుగా ఈవీఎంలు మొరాయిస్తున్నాయి. దీంతో ఓటర్లు వెనుదిరుగుతున్నారు.

## సిఎం జగన్‌కు కమీషన్లపై
## ఉన్న శ్రద్ధ పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై లేదు

**కాకినాడ :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో కొనసాగుతోంది. గురువారం కాకినాడ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని తాళ్లరేవు మండలంలో 213వ రోజు పాదయాత్రను లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తాళ్ళరేవులో లోకేష్‌ను పలువురు నిరుద్యోగులు కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు.దీనిపై నారా లోకేష్ స్పందిస్తూ... ముఖ్యమంత్రి జగన్‌కు కమీషన్లపై ఉన్న శ్రద్ధ పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై లేదన్నారు. చంద్రబాబు తెచ్చిన కంపెనీలను జే ట్యాక్స్ కోసం వేధించి తరిమేశారని మండిపడ్డారు. జే - గ్యాంగ్ వ్యూహం అని లక్షలది ఉద్యోగాలు కల్పించే ఫ్యాక్స్ కాన్, లులూ, అమర్ రాజా, జాకీ వంటి పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలి పరారయ్యాయన్నారు. టీడీపీ హయాంలో పరిశ్రమల ద్వారా యువతకు 6 లక్షల ఉద్యోగాలు కల్పించిందని వైసీపీ ప్రభుత్వమే అసెంబ్లీ సాక్షిగా అంగీకరించిందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాళ్లరేవులోని నిరుద్యోగ యువకులకు స్థానిక కంపెనీలతో మాట్లాడి ఉద్యోగాలిచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యువకులు ఉద్యోగాలు వచ్చేవరకు యువగళం నిధి కింద నెలకు రూ.3వేలు భృతి కల్పిస్తామన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో రాబోయే 5 ఏళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల ఏర్పాటుతో 20లక్షల ఉద్యోగాలిస్తామన్నారు. ప్రతియేటా జాబ్ నోటిఫికేషన్ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని లోకేష్ పేర్కొన్నారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంగించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

**- కేసు నమోదు చేసిన పోలీసులు**

**నిర్మల్ :** ఎన్నికల నిబంధనలు అతిక్రమించారనే ఫిర్యాదుతో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇవాళ ఎల్లపెల్లి లో పార్టీ కండువా వేసుకుని ఇంద్రకరణ్ పోలింగ్ కేంద్రానికి వచ్చారు. కండువాతోనే ఓటు వేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ప్రతిపక్ష నేతలు ఆందోళన నిర్వహించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎవరు కూడా పోలింగ్ జరిగే 28న ప్రచారం ముగిసింది. పార్టీ గుర్తులు కనిపించేలా చేయటం, ఫలానా గుర్తుకు ఓటు వేయాలని చెప్పటం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. ఆ నిబంధనలు ఉల్లంఘించి పోలింగ్ కేంద్రానికి ఆయన సింబల్‌తో కూడిన పార్టీ కండువా వేసుకుని వెళ్లటం గమనార్హం. ఆయన తీరుపై ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు.

## ఎంఎల్‌సీ కల్వకుంట్ల కవిత, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై పిర్యాదు

**- డీఈఓ రిపోర్ట్ ఆధారంగా కోడ్ ఉల్లంఘించినట్లు తెలిస్తే ఎఫ్ఐఆర్: సీఈఓ**

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని సీఈఓ వికాస్ రాజ్ అన్నారు. కొన్ని చోట్ల ఈవీఎంల సమస్య వచ్చి.. అక్కడ కొత్తవి మార్చినట్లు చెప్పారు. అర్బన్ ఏరియాల్లో ఇంకా పోలింగ్ శాతం పెరగాలని అన్నారు. ఇక నుంచి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక అక్కడక్కడ చిన్నచిన్న ఘర్షణలు జరిగాయని, అలా గొడవలు జరిగిన ప్రతి కంప్లైంట్‌పై డీఈఓను రిపోర్ట్ అడిగినట్లు తెలిపారు.అలాగే ఎంఎల్‌సీ కల్వకుంట్ల కవిత, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కంప్లైంట్స్ వచ్చాయని చెప్పారు. డీఈఓ రిపోర్ట్ ఆధారంగా కోడ్ ఉల్లంఘించినట్లు తెలిస్తే ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేస్తామన్నారు. అయితే, కవిత వ్యాఖ్యలపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు అయిందని వికాస్ రాజ్ తెలిపారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 11 గంటల వరకు 20.64శాతం పోలింగ్ నమోదయిందని, రూరల్‌లో కూడా పోలింగ్ శాతం బాగానే ఉందన్నారు.

# టీడీపీ ఎస్సీ సెల్ భేటీలో విభేదాలు

**విజయవాడ** ఈరోజు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న దళితులపై దమనకాండకు నిరసనగా కార్యక్రమంలోఎస్సీ సెల్ నేతలు రెండు వర్గాలుగా చీలిపోయారు. కేశినేని చిన్ని ఫోటోలు ఎందుకు ప్రచురించడంలేదని కేశినేని నాని వర్గం నిలదీసింది. గత రెండు సంవత్సరాలుగా ఎన్టీఆర్ జిల్లాలో కేశినేని చిన్ని చేస్తున్న సేవలు మరియు పార్టీ నేతలను కలుపుకుంటూ ఎన్నో కార్యక్రమాలు చేస్తు తెలుగుదేశం పార్టీకి అండగా ఉంటున్న కేశినేని చిన్ని ఫోటో ఎందుకు ప్రచురించకూడదని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఇతర నేతలు అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేశినేని చిన్ని ఫోటోను ఎట్టి పరిస్థితుల్లో తొలగించే ప్రసక్తి లేదని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ తేల్చి చెప్పారు.

# దుర్గమ్మ ఆలయంలో గణపతి హవనం

**ఇంద్రకీలాద్రి** గురువారం సంకట హర చతుర్థి సందర్భంగా ఉదయం చిన్న రాజగోపురం వద్ద ఉన్న లక్ష్మీ గణపతి స్వామి వారి మందిరం వద్ద వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ వైదిక సిబ్బందిచే శాస్త్రోక్తముగా గణపతి స్వామి వారికి అభిషేకం, పూజ మరియు గణపతి మంత్రము హవనము(హోమం)ను వైభవముగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె ఎస్ రామరావు, వైదిక సిబ్బంది, ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులు హోమంను విశేషముగా తిలకించారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న హిజ్రాలు

**జగిత్యాల** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కును ట్రాన్స్ జెండర్స్ వినియోగించుకున్నారు.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవడం కనీస బాధ్యత అని సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవాలని తెలిపారు... ట్రాన్స్ జెండర్స్ ల సమస్యలు గత ప్రభుత్వాలకు తమ సమస్యలను విన్నవించుకున్న పరిష్కారం కాలేవని ఇప్పుడు వచ్చే నూతన ప్రభుత్వం పరిష్కరించాలని తెలిపారు..

# కవిత ఎన్నికల కోడ్ ఉల్లంఘన

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించారు. బంజారాహిల్స్‌లోని నందినగర్ ప్రాంతంలో డీఏవీ స్కూల్ పోలింగ్ స్టేషన్‌లో కవిత ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆ తర్వాత కవిత మీడియాతో మాట్లాడారు. ప్రజలు అందరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని అందరూ ఓటు వేయాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘించేలా కవిత వ్యాఖ్యలు చేశారు. తమకు ఓటు వేయాలనే వ్యాఖ్యలు చేయకూడదనే నిబంధనలు ఉన్న సంగతి తెలిసిందే.కవిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లి నిబంధనల ప్రకారం కవితపై చర్యలు తీసుకోవాలని కోరారు.పట్టణ ప్రాంతాల్లో దారుణంగా ఓటింగ్ – కవితఅర్బన్ ఓటింగ్ చాలా దారుణంగా ఉంటోందని కల్వకుంట్ల కవిత అన్నారు. పట్టణ ఓటర్లు కచ్చితంగా పోలింగ్ బూత్ కు రావాలని పిలుపు ఇచ్చారు. గత ఎన్నికల్లో కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ మెరుగ్గా ఉన్నప్పటికీ అర్బన్ ఏరియాల్లో చాలా దారుణంగా ఉందని అన్నారు.దుర్గం చిన్నయ్య కూడా ఎన్నికల కోడ్ ఉల్లంఘనబీఆర్ఎస్ కండువా వేసుకొని ఓటు వేయడానికి వెళ్ళి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నెన్నెల మండలం జెండా వెంకటాపూర్ 219 పోలింగ్ బూత్ లో దుర్గం చిన్నయ్య కుటుంబ సభ్యులు ఓటు వేశారు. ఆయన కోడ్‌ను ఉల్లంఘించడం పట్ల ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.కండువాతో వచ్చిన ఇంద్రకరణ్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ బిఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పోలింగ్ బూత్లోకి పార్టీ కండువాతో వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఆయన ఎల్లపల్లి గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్ కు కండువాతో వెళ్లడం ఏంటని, ఇది ఓటర్లను ప్రభావితం చేసినట్లు అవుతుందని విమర్శలు వస్తున్నాయి. మరి దీనిపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

# బద్ధకానికి బ్రాండ్ అంబాసిడర్

**హైదరాబాద్ :** తెలంగాణ వ్యాప్తంగా పోలింగ్ సందడి కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రావ దగ్గర క్యూ కట్టారు. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులూ, ఇతర అధికారులు కూడా ఓట్లు వేయడానికి తరలివస్తున్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం మొత్తం ఓ లెక్క..హైదరాబాద్ ఒక్కటి మరోలెక్క అన్నట్టు పరిస్థితి మారింది. ఈ ఏడాది కూడా హైదరాబాద్ లో ఓటింగ్ శాతం తక్కువే నమోదయ్యేట్టుంది. తెలంగాణ వ్యాప్తంగా అతి తక్కువ ఓటింగ్ హైదరాబాద్ లోనే కావడంతో ఈ డిస్కషన్ జరుగుతోంది.ఎన్నికల రోజును ప్రభుత్వం పెయిడ్ హాలిడేగా ప్రకటిస్తోంది. ప్రైవేటు సంస్థలు కూడా దీన్ని అమలు చేస్తున్నాయి. అయినా ఓటేసేందుకు ఓటర్లు పెద్దగా ఉత్సాహం చూపించడం లేదు. బారెడు పొద్దెక్కినా ఏదో వీకెండ్ రోజు రిలాక్సవుతున్నట్టు ఇల్లు దాటి బయటకు రావడం లేదు. ఇల్లు కదలనివారు కొందరైతే...హాలిడే వచ్చిందంటూ సొంత పనులు చూసుకుంటున్నవారు మరికొందరు. సెలవు ప్రకటించి మరీ ఓటేయమంటే భాగ్యనగర వాసుల తీరు ఇలా ఉందిభాగ్యనగర ఓటర్ల తీరును కొందరు నెటిజన్లు ఎండగడుతున్నారు. తెల్లారితే నీళ్లు రావడం లేదు, రోడ్లు బాలేవు, ఈ సమస్య ఆ సమస్య అంటూ హడావుడి చేసేవారంతా తన బాధ్యతను నిర్వర్తించే రోజు వచ్చేసరికి మాత్రం బద్ధకం చూపిస్తున్నారంటున్నారు. ఉదయం 11 గంటలు గడిచినా హైదరాబాద్ లో కేవలం 12 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది...ఉదయం 11 గంటల వరకూ హైదరాబాద్ లో 9.57 శాతం మాత్రమే ఓటింగ్ నమోదయ్యింది హైదరాబాద్ లో అత్యల్పంగా నాంపల్లిలో 2.5 శాతంసనత్ నగర్ లో 1.2 శాతంకూకట్పల్లిలో 3.9 శాతంమేడ్చల్లో 4 శాతంగోషామహల్ లో6 శాతంచార్మినార్లో8 శాతంముషీరాబాద్ లో 7 శాతంరాజేంద్రనగర్ లో అత్యధికంగా 15 శాతం పోలింగ్ నమోదయ్యింది. అర్బన్ ఓటింగ్ చాలా దారుణంగా ఉంటోందని కల్వకుంట్ల కవిత అన్నారు. పట్టణ ఓటర్లు కచ్చితంగా పోలింగ్ బూత్ కు రావాలని పిలుపు ఇచ్చారు. గత ఎన్నికల్లో కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ మెరుగ్గా ఉన్నప్పటికీ అర్బన్ ఏరియాల్లో చాలా దారుణంగా ఉందని అన్నారు.తెలంగాణ వ్యాప్తంగా ఉదయం పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభం కాగా ఆ తర్వాత ఘర్షణల వాతావరణం హోరెత్తింది. జనగామ జిల్లాలో మరోసారి ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. జనగామ జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియ ర్ కళాశాల 245 పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ వాతావరణం రేగింది. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలింగ్ కేంద్రం వద్ద అధిక సంఖ్యలో ఉండడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పరస్పరం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో లాఠీలకు పని చెప్పి పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

# పోలింగ్.. పలు చోట్ల ఉద్రిక్తలు

**హైదరాబాద్ :** తెలంగాణ వ్యాప్తంగా పోలింగ్ జరుగుతుండగా కొన్ని చోట్ల ఉద్రిక్తతలు మొదలయ్యాయి. ఉదయం పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభం కాగా, మెల్లగా ఘర్షణలు జరుగుతున్నాయి. జనగామ జిల్లాలో మరోసారి ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. జనగామ జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 245 పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ వాతావరణం రేగింది. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలింగ్ కేంద్రం వద్ద అధిక సంఖ్యలో ఉండడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పరస్పరం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో లాఠీలకు పని చెప్పి పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.244వ పోలింగ్ బూత్ వద్ద కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్ బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ నెలకొంది. రంగంలోకి దిగిన పోలీసులు కార్యకర్తలను చెదరగొట్టారు. పోలింగ్ సరళి పరిశీలిస్తున్న క్రమంలో తోపులాట జరిగింది.ఖానాపూర్ లో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల ఘర్షణ – పోలీసుల లాఠీఛార్జ్ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ నెలకొంది. విజయమేరి పోలింగ్ కేంద్రం వద్ద వివాదం నెలకొనగా, ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు లాఠీఛార్జ్ చేసి వారిని చెదరగొట్టారు.ఖమ్మంలోనూ గొడవలు – కాంగ్రెస్ కార్యకర్తలపై దాడిఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్ గూడెంలోనూ పోలింగ్ వేళ గొడవలు చెలరేగాయి. కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నేతలు దాడికి పాల్పడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

నాగర్ కర్నూల్ జిల్లా ఆమ్రాబాద్ మండలం మన్ననూర్ లో ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ నెలకొంది. ఇరు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు.బోధన్ పట్టణంలోని స్థానిక విజయమేరీ స్కూలులో పోలింగ్ జరుగుతుండగా సమీపంలో కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. లాఠీ చార్జి చేస్తు?న్న పోలీసులు కేవలం కాంగ్రెస్ కార్యకర్తల్ని మాత్రమే కొడుతున్నారని, బీఆర్ఎస్ మద్దతుదారులను ఏమీ అనడం లేదని విపక్ష కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**జగిత్యాల** జగిత్యాల జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో గురువారం పోలింగ్ ప్రకియప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.. ఓటింగ్ లో పాల్గొన్న ప్రజలంతా కూడా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, జిల్లాలో ఏ ప్రాంతంలో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ శాఖ ఇతర శాఖ సమన్వయంతో సమర్థవంతంగా అధికారులు సిబ్బంది విధులు నిర్వహించారన్నారు. పోలింగ్ పూర్తయిన ప్రతి పోలింగ్ స్టేషన్ నుంచి ఓటింగ్ సామాగ్రి మొత్తం విఆర్కే స్ట్రాంగ్ రూమ్ కు తరలించి అక్కడ కేంద్ర బలగాలతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేశామన్నారు.. అంతకుముందు ఎస్పీ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు..

# కామారెడ్డిలో హై డ్రామా

**కామారెడ్డి** కామారెడ్డి కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బిఆర్ ఎస్ నేతల మధ్య వాగ్వాదం తీవ్ర స్థాయిలో కొనసాగింది. అక్కడికి ఇరు పార్టీల కార్యకర్తలు భారిగా చేరుకున్నారు. ఇరుపక్షాల వారిని పోలీసులు చెదరగొట్టారు.

## హుజూర్నగర్ ఎమ్మెల్యే శానంపూడి
# సైదిరెడ్డి సిఐపై దౌర్జన్యం...

**- గెలిచిన తర్వాత ఈ సంగతి చూస్తా అంటూ బెదిరింపు**

**హుజూర్ నగర్** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ వి.వి మందిర్ స్కూల్ 217,218,222,223 లో ఎమ్మెల్యే సైదిరెడ్డి అనుచరుల తో పార్టీ కండువా ల తో ప్రచారం చేసారు. దీన్ని గమనించిన స్థానిక సిఐ కండువాలు తీయాలని అన్నారు. సి. ఐ పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, గెలిచేది నేనే నీ సంగతి చూస్తా అంటూ బెదిరింపులుకు దిగారు. సి. ఐ మాటలను ఎమ్మెల్యే బేకాతరు చేసారర. ఎమ్మెల్యే కి సి. ఐ మద్య వాగ్వాదం జరిగింది.

# ఓటర్లు వింత నిరసన

**భద్రాద్రి** పినపాక నియోజకవర్గం మణుగూరు మండలంలోని రాజపేట గ్రామంలో 141, 144 బూత్ లలో వింతనిరసన చేపట్టారు...ఏ పార్టీ వాళ్లు వచ్చి డబ్బులు పంచలేదని, అందుకే ఓటు వేయమని పోలింగ్ కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.. పార్టీల దగ్గర డబ్బులు తీసుకొచ్చి కొంతమందికే పంచారని మిగతా వాళ్ళకి పంచలేదని డబ్బులు ఇచ్చేదాక ఓటు వేయమని చెబుతున్నారు....

# ముషీరాబాద్‌లో బ్యాలెట్ పత్రాలు తారుమారు

**హైదరాబాద్** ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూతులలో ఈవీఎం లో బ్యాలెట్ పత్రాలను తారుమారుగా ఏర్పాటు చేయడం పట్ల పలువురు అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తదితర బూతులలో మొదటి పేజీలో ఉండాల్సిన బ్యాలెట్ పేపర్ ని రెండో పేజీలో రెండో పేజీలో ఉండాల్సిన బ్యాలెట్ పేపర్ ని మొదటి పేజీలో పెట్టడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం. అంజన్ కుమార్ యాదవ్ బిజెపి అభ్యర్థి పూస రాజులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనితో అప్రమత్తమైన అధికారులు తప్పును సరిదిద్దుకొని యధావిధిగా చేయడం జరిగింది. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ అభ్యర్థులకు వత్తాసు పలుకుతున్న అధికారులు ఈవీఎంపై చూపిస్తున్న బ్యాలెట్ను తారుమారు చేస్తూ అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ఫిర్యాదు చేస్తామని ఆయన వెల్లడించారు.

# నాగార్జున సాగర్ ప్రాజెక్టు దగ్గర ఉద్రిక్తత

**నల్గొండ :** నాగార్జున సాగర్ ప్రాజెక్టు దగ్గర గురువారం తెల్లవారుఝామున ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్ పోలీసులు నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చి నీటి విడుదలకు ప్రయత్నించారు. ఇందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి దాటాక అక్రమంగా ప్రాజెక్టులోనికి చొరబడి డ్యామ్‌కు ముళ్లకంచె పెట్టారు. సాగర్ ప్రాజెక్టుకు ఉన్న 26 గేట్లలో సగ భాగం.. అంటే 13వ గేట్ వరకు ప్రాజెక్టు తమ పరిధిలోకి వస్తుందని ఏపీ పోలీసులు వాదిస్తున్నారు. నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు దాదాపు 500 మంది దాకా పోలీసు సిబ్బందితో నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చారు. వారిని డ్యామ్ కు కాపలాగా ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందిపై దాడి చేసి.. వారి మొబైల్ ఫోన్లు కూడా లాక్కున్నారు. 13వ గేట్ వద్దకు చేరుకొని ముళ్ల కంచె పెట్టి.. డ్యామ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.. ఏపీ పోలీసులు.సాగర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. పల్నాడు జిల్లాలో భారీగా మోహరించి రాత్రి సమయంలో సాగర్ కు వెళ్లారు. సాగర్ వద్ద మీడియాపై పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డి జులుం ప్రదర్శించారు. మీడియా ప్రతినిధుల ఫోన్లు కూడా ఏపీ పోలీసులు లాక్కున్నారు. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో ఏపీ పోలీసులు వెళ్లడంపై ఉత్కంఠ నెలకొని ఉంది.ఇదంతా కేసీఆర్ పనే – ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిసాగర్ డ్యాంపై పోలీసుల హడావిడిపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. సాగర్ డ్యాంపై పోలీసుల డ్రామా కేసీఆర్ పనే అని విమర్శించారు. ఓడిపోతున్నారని కేసీఆర్ కి అర్థమై తెలంగాణ సెంటిమెంట్ రగిలిస్తున్నారని ఆరోపించారు. ఇన్ని రోజులు లేని హడావిడి పోలింగ్ రోజే ఎందుకు అవుతోందని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ, ఏపీ పోలీసులు కలిసి చేసే డ్రామాలు ఎవరూ నమ్మవద్దని కోరారు. తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ఎన్నికల కోసం వాడుతున్నారు. కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని.. 90 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని కోమటిరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.స్పందించిన ఎన్నికల కమిషనర్నాగార్జున సాగర్ డ్యాం వద్ద జరుగుతున్న హైటెన్షన్ వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్ స్పందించారు. రాజకీయ నేతలు ఎవరూ ఆ విషయంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని అన్నారు. డ్యాం దగ్గర జరుగుతున్న వ్యవహారాన్ని పోలీసులు చూసుకుంటారని చెప్పారు. వికాస్ రాజ్ హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ లో ఓ పోలింగ్ కేంద్రంలో తన సతీమణితో కలిసి ఓటు వేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.కుట్రలు పనిచేయవు – రేవంత్ నాగార్జున సాగర్ ఘటనపై స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్పందించారు. కొడంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు దగ్గర ఉద్రిక్తతలు కేసీఆర్ కుట్ర అని రేవంత్ ఆరోపించారు. రాజకీయ లబ్ది కోసం చేస్తున్న కేసీఆర్ పన్నాగాలు ఫలించబోవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సమర్థంగా నీటి పంపకాల విషయాన్ని పరిష్కరిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.పోలింగ్ రోజు ఇలాంటి ఘటనలకు తెరలేపారు. తెలంగాణ ప్రజలు సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ఏం ఆశించి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారో కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తొమ్మిదిన్నర ఏళ్లుగా కేసీఆర్ ఈ సమస్యను పరిష్కరించకపోవడంవల్లే ఇలాంటి ఘటనలు ఉత్పన్నమవుతున్నాయి. వీటన్నింటికి శాశ్వత పరిష్కారం ప్రజామోదయోగ్యమైన ప్రభుత్వం ఏర్పడటమే. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇతర రాష్ట్రాలతో ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తాం. దేశాల మధ్య నీటి వాటాలు పంచుకుంటున్నాం.. అలాంటిది రాష్ట్రాల మధ్య వాటాలు పంచుకోలేమా..?నీటి వాటాలు, ఆస్తుల పంపకాల విషయంలో కాంగ్రెస్ సమయస్ఫూర్తితో, సమన్వయంతో వ్యవహరిస్తుంది. అవసరమైనప్పుడు ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ ను కేసీఆర్ ఉపయోగించుకుంటున్నారు. రాజకీయ లబ్ది కోసం చేస్తున్న కేసీఆర్ పన్నాగాలు ఫలించవు. కేసీఆర్ వి దింపుడు కల్లం ఆశలే.. ఇలాంటి కుట్రలు ఎన్నికలపై ప్రభావం చూపాల్సిన అవసరం లేదు. వివాదాలను సామరస్యంగా సరైన పరిష్కారం చూపించే బాధ్యత మాది” అని రేవంత్ రెడ్డి మాట్లాడారు.

# రెండో సొరంగం పనులు పూర్తి

**కర్నూలు :** కరువు సీమ రాయలసీమ కళకళలాడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టంది. గాలేరు?నగరి సుజల స్రవంతి పథకంలో అంతర్భాగమైన అవుకు రెండో సొరంగం పనులను ప్రభుత్వం అత్యాధునిక పరిజ్ఞానం ఉపయోగించి పూర్తి చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైస్ జగన్ గురువారం దానిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. తద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు గాలేరు ? నగరి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులను తరలించేందుకు మార్గం సుగమం అయ్యింది.వైఎస్సార్ హయాంలో రూ.340.53 కోట్లు వెచ్చించగా చంద్రబాబు సర్కారు రూ.81.55 కోట్లు ఖర్చు చేసింది. జగన్ అధికారంలోకి వచ్చాక రూ.145.86 కోట్లు ఖర్చు చేసి టన్నెల్ 2 పనులను పూర్తి చేశారు.

అంతే కాదు 5.801 కి.మీ. పొడవైన మూడో టన్నెల్‌లో ఇప్పటికే 4.526 కి.మీ. పొడవైన పనులను పూర్తి చేశారు. ఇందు కోసం ఏకంగా రూ.934 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మూడు టన్నెళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1,501.94 కోట్లు ఖర్చు చేసింది. ఫలితంగా 30 వేల క్యూసెక్కుల నీటిని తరలించే వెసులుబాటు కలగనుంది.శ్రీశైలానికి వరద వచ్చే సమయంలో రోజుకు 20 వేల క్యూసెక్కుల చొప్పున 30 రోజుల్లో 38 టీఎంసీలను తరలించేలా ప్రభుత్వం పనులు చేపట్టింది. దీని ద్వారా ఉమ్మడి కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాల్లో 20 లక్షల మందికి తాగునీరు అందించే అవకాశం కలుగుతుంది. దివంగత సీఎం వైఎస్సార్ 2005లో గాలేరు నగరి సుజల స్రవంతిని చేపట్టారు. గోరకల్లు రిజర్వాయర్ నుంచి 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 57.7 కి.మీ. పొడవున వరద కాలువ, దీనికి కొనసాగింపుగా అవుకు రిజర్వాయర్ వద్ద కొండలో 5.7 కి.మీ. పొడవున 16 మీటర్ల వ్యాసంతో ఒక సొరంగం తవ్వకం పనులు చేపట్టారు.

మట్టి పొరలు బలహీనంగా ఉన్నందున పెద్ద సొరంగం తవ్వితే కుప్పకూలే ప్రమాదం ఉందని కేంద్ర భూగర్భ శాస్త్రవేత్తలు నాడు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీంతో ఒక సొరంగం స్థానంలో 11 మీటర్ల వ్యాసంతో 5.7 కి.మీ. పొడవున, పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో రెండు చిన్న సొరంగాల తవ్వకం పనులు చేపట్టారు. అవుకులో 2010 నాటికి ఎడమ వైపు సొరంగంలో 350 మీటర్లు, కుడి వైపు సొరంగంలో 180 మీటర్ల పొడవున ఫాల్ట్ జోన్‌లో పనులు మాత్రమే మిగిలాయి. ఆ పనులను జగన్ ప్రభుత్వంం పాలీయురిథేన్ ఫోమ్ గ్రౌటింగ్ విధానంలో విజయవంతంగా పూర్తి చేసింది. ఫలితంగా రెండు సొరంగాల ద్వారా 20 వేల క్యూసెక్కులను గాలేరు?నగరి వరద కాలువ ద్వారా తరలించేలా మార్గం సుగమం చేశారు. దీంతో శ్రీశైలానికి వరద వచ్చే 15 రోజుల్లోనే గండికోట జలాశయాన్ని నింపవచ్చు.త్వరలోనే మూడో టన్నెల్ పూర్తిశ్రీశైలానికి వరద వచ్చే రోజుల్లోనే గాలేరు?ునగరిపై ఆధారపడ్డ ప్రాజెక్టులను నింపేలా వరద కాలువ సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు పెంచే పనులను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే రెండు టన్నెళ్లను పూర్తి అవగా మూడో టన్నెల్ కూడా పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుంది.

## ఉత్సాహంగా ఓటు హక్కును
# వినియోగించుకున్న యువత

**జగిత్యాల** జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది... ఎన్నికల్లో యువత తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహన్ని కనబరిచారు.. భారీగా క్యూలైన్ లు ఉన్న క్యూలైన్ లో వేసి ఉండి యువతి ,యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.. ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం వారు సెల్ ఫోన్ ల్లో సెల్ఫీలు తీసుకొని సామాజిక మాధ్యమల్లో పోస్టులు చేసుకున్నారు..కొత్త ఓటర్లలో ఉత్సహం నింపిన ఓటు హక్కుజిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజక వర్గం కేంద్రంల్లో 18 సంవత్సరాల నిండిన యువతి, యువకులు ఆసక్తిగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.. గురువారం ఈ సందర్భంగా ఉదయం నుండి సంబంధిత నియోజక వర్గ పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్ లో ఉండి ఓటు హక్కును వినియోగించుకొని ఆనందంగా బయటకు వచ్చి సెల్ఫీలు దిగి సంబరాలు జరుపుకున్నారు.. కొత్తగా, మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోవడం ఆనందంగా ఉన్నారు.

## బాధిత కుటుంబానికి 10000 వేలు ఆర్థికసహాయం చేసి కుటుంబాన్ని పరామర్శించిన కోట్ల సుజాతమ్మ

**దేవనకొండ** : గురువారం దేవనకొండ మండల కేంద్రంలోని యస్.సి కాలనీ నందు రామాంజనేయులు నివాసం ఉంటున్న తన పూరి గుడిసె సోమవారం షాట్ సర్క్యూట్ వల్ల దగ్ధం అవ్వడం జరిగింది.ఈ విషయం స్థానిక నాయకులు దేవనకొండ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న సందర్భంగా గురువారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, అనంతరం ఆ కుటుంబానికి పెద్ద మనసుతో స్పందించి. సుజాతమ్మ 10000 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సాయం పట్ల ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం పరిచారు. అనంతరం దేవనకొండ మండల కేంద్రంలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని గడపగడప తిరిగి టిడిపి ఇచ్చే హామీలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవనకొండ మండల నాయకులు మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి ఉచ్చురప్ప, మలకన్న, పి రాజా సాహెబ్, టౌన్ ప్రెసిడెంట్ కందనాతి మస్తాన్, డీలర్ బండ్లయ్య, పళ్ళదొడ్డి రాజశేఖర్, కుంకునూర్ రాజగోపాల్ గౌడ్, దేవనకొండ వైస్ ప్రెసిడెంట్ భర్త పోగన్న, పూల నరసమ్మ ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పెనుగుదురులో
# ఆరోగ్య ఉప కేంద్రంలో అగ్ని ప్రమాదం

### - మూడు లక్షలు మందులు సామాగ్రి నష్టం

కరప మండలం పెనుగుదురు పిహెచ్ సి సబ్ సెంటర్లో బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని పిహెచ్సి వైద్యులు శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈ ప్రమాదం లో మందులు, ఫర్నిచర్, ఆక్సీజన్ సిలండర్ కాలిపోయినట్టు తెలిపారు.జగన్నాధపురం ఫైర్ నివారణ అధికారి ఏసుబాబు తమ సిబ్బందితో ఫైర్ వాహనం తీసుకొచ్చి మంటలు అదుపు చేశారు. సంఘటనా స్థలానికి కరప ఏఎస్ఐ ప్రసన్నకుమార్ సిబ్బందితో హుటా హుటిన చేరుకొని స్థానికుల చెప్పిన వివరాలు తో కేసు నమోదు చేశారు.పెనుగుదురు సచివాలయం వద్ద జరిగిన ఈ సంఘటన పై సర్పంచ్ రెడ్డిపల్లి వెంకట మాధవి రమేష్ స్వయం గా పరిస్థితి వివరాలు తెలిపారు. సబ్ సెంటర్ పక్కనే ఉండటంతో తగులుపడతాయని ఆందోళన చెందారు. అయితే పిఎస్సి సబ్ సెంటర్లో ఉన్న రికార్డులు కంప్యూటర్లు టేబుల్స్ పూర్తిగా అగ్నికి కాలి బూడిదయినాయి . గురువారం కరప పిహెచ్సి వైద్యాధికారి శ్రీనివాస నాయక్ పోలీస్ స్టేషన్ లో పూర్తి వివరాలు తో పిర్యాదు చేశారు.సుమారు 3 లక్షలు నష్టం కలిగిందని పిర్యాదు లో తెలిపారు.

## కార్తీక మాస యాదవ సామాజిక వర్గ ఆత్మీయ సమ్మేళనం

**పత్తికొండ** పత్తికొండలో కార్తీకమాస యాదవ సామాజిక వర్గ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని డిసెంబర్ 10వ తేదీ ఆదివారం రమ్య రిసార్ట్స్ లో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ నాయకులు మీడియాకు గురువారం తెలియజేశారు. రాష్ట్ర యాదవ సంఘం నాయకులు, జిల్లా నాయకులు పత్తికొండ నియోజకవర్గ నాయకులు సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. పత్తికొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు, యాదవులు హాజరుకావాలని కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా
# వైద్యానికి ఆర్థిక సహాయం

### - ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆర్థిక సహాయాన్ని అందచేసిన జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్

**నంద్యాల** అవుకు మండలం మెట్టుపల్లె సమీపంలో అవుకు రెండో టన్నెల్ జాతికి అంకితం చేసి పైలాన్ ను ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హాజరైన సందర్భంగా.... తన మంచి మనసును మరోసారి చాటుకున్నారు.అనంతపురం జిల్లా నార్పల మండలం బొమ్మకుంట గ్రామ నివాసితుడు నారా పుల్లారెడ్డి తనకు53 సంవత్సరాలని...ఒక కిడ్నీ మాత్రమే ఉందని... అది కూడా చెడిపోయిందని తీవ్ర నొప్పులతో బాధపడుతున్నానని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా... ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, వ్యాధి చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తగిన ఆర్థిక మరియు ఇతర సహాయాలను అందించాలని కలెక్టర్ ని ఆదేశించారు.అలాగే అవుకు మండలం గోకులదిన్నె గ్రామ నివాసితుడు గంగే గుర్రప్ప తన కుమార్తె హర్షిత 16 నెలల పాపని... చిన్న వయసులోనే తన కుమార్తె గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోందని వ్యాధి చికిత్సకు తగిన ఆర్థిక స్తోమత తమ వద్ద లేదని, ముఖ్యమంత్రి గారు సహాయం చేయాలని కోరగా... ముఖ్యమంత్రి వెంటనే స్పందించి వ్యాధి చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తగిన ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ ని ఆదేశించారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ నార్పల మండలం బొమ్మకుంట గ్రామ నివాసితుడు నారా పుల్లారెడ్డి కిడ్నీ చికిత్స కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.అలాగే అవుకు మండలం గోకులదిన్నె గ్రామానికి చెందిన గంగే గుర్రప్ప కుమార్తె హర్షిత 16 నెలల పాప గుండె సంబంధిత వ్యాధి చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లక్ష రూపాయల చెక్కును తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డిలు అందజేశారుముఖ్యమంత్రి అంద చేసిన సహాయానికి ముఖ్యమంత్రికి మరియు జిల్లా కలెక్టర్ కి వ్యాధిగ్రస్త కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## తహసిల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు భూ హక్కు పత్రాల పంపిణీ

**ఆత్మకూరు** నెల్లూరు జిల్లా ఏ.ఎస్.పేట మండలంలో 20 సంవత్సరాలు పూర్తయిన అసైన్మెంట్ పట్టాలుకు భూ హక్కు కల్పిస్తు తహసిల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ లక్ష్మి నరసింహం మాట్లాడుతూ మొదటి ఫేసులో మండలంలోని 12 గ్రామాలకు సంబంధించి 750 ఎకరాలను 270 ఒక మందికి భూహక్కు పత్రాలు పంపిణీ చేయగా రెండో ఫేస్ లో మిగిలిన గ్రామాలను మిగిలిన భూ పంపిణీ భూ హక్కు పత్రాలను పూర్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా జడ్పిటిసి పందిళ్ళపల్లి రాజేశ్వరమ్మ, ఎంపీపీ పద్మజా రెడ్డి, జేఏసీ కన్వీనర్ పులిమి రమేష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వాస్పత్రి వద్ద ఉద్రిక్తత

సాధారణం మరణం చెందిన వ్యక్తికి పోస్ట్ మార్టం చేసేందుకు పోలీసులు సిద్ధం కావడంతో మృతుడి బంధువులు పోలీసుల చర్యలను నిరసిస్తూ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. బంధువులు చేస్తున్న ఆందోళనకు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మద్దతు తెలిపారు. గురువారం ఉదయం 8గంటల సమయంలో సాధారణ మరణం చెందిన బందరు మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన బొర్రా పున్నారావు(35), మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. వైద్యుల సమాచారంతో తాలుకా పోలీసులు కేసు నమోదు చేసారు. మృతదేహానికి పీఎం చేసేందుకువైద్యులు సిద్ధపడ్డారు. పీఎం చేసే చర్యలను బంధువులు అడ్డుకున్నారు. సాధారణ మరణానికి ఎలా పీఎం చేస్తారని పోలీసులను గ్రామస్థులు నిలదీసారు. భార్య కుసుమ తన భర్త మృతదేహాన్ని తమకు అప్పగించాలని కన్నీటి పర్యంతమైయింది.

## ఓటరు వెరిఫికేషన్ పారదర్శకంగా జరగాలి

**విశాఖపట్నం** ఓటరు వెరిఫికేషన్ పారదర్శంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బిజేపి ఎంపి జీవిఎల్ డిమాండ్ చేశారు. విశాఖ ఉత్తరనియోజకవర్గ పరిదిలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే స్థానిక ఓటర్ల వేరిఫికేషన్ పై చూపిస్తున్న చొరవను అభినందించిన ఆయన ... భాద్యతాయుతంగా ఓటరు వెరిఫికేషన్ పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.
గతంలో ఓటరు జాబితాలో ఉన్న అవకతవకలను సర్కారు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం సూన్యమని,మరణించిన వారి జాబితా ఓటరు లిస్ట్ లో ఉండటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి ఓటరు వెరిఫికేషన్ పై దృష్టి సారించాలని అప్పుడే ఎన్నికలు సజావుగా జరిగే అవకాశాలు ఉంటాయని చెప్పారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

### - ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

**నందిగామ** కంచికచర్ల మండలం పరిటాల బైపాస్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొంది. జీ కొండూరు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన పాస్టర్ మెరుగు బసవయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి.
ప్రమాద స్థలానికి వెంటనే చేరుకున్న హైవే మొబైల్ పోలీసులు వెంటనే 108కి సమాచారం అందించి బసవయ్యను విజయవాడ హాస్పటల్ కు తరలించేలా చర్యలు తీసుకున్నారు

# బాసరలో ఘర్షణ

**నిర్మల్** నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రం పోలింగ్ కేంద్రంలో బిఆర్ ఎస్, బిజెపి నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. పోలింగ్ కేంద్రం లోపల ప్రచారం చేస్తున్నారని ఒక పార్టీ పైన మరొక పార్టీ ఆరోపణలు చేసుకున్నాయి. పోలీసులు వచ్చి ఇరు పార్టీల నాయకులను చెదరగొట్టారు

## జగనన్న ఇళ్ళు సకాలంలో
# పూర్తి చేయండి

**తిరుపతి** తిరుపతి అర్బన్ పరిధిలోని వారికి కట్టిస్తున్న జగనన్న ఇళ్ళు సకాలంలో, నిర్ణయించిన మేరకు పూర్తి చేసేలా అధికారులు పనులు చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం హౌసింగ్ అధికారులు, మునిసిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ హరిత ప్రత్యేక సమావేశం నిర్వహించగా, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత ఐఏఎస్ మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలోని అర్హులైన ప్రజలకి చిందేపల్లి, సూరప్పకశం, ఎం.కొత్తపల్లి, జీ పాళెం, కల్లూరు, టిసి అగ్రహారం లే అవట్లలో నిర్మిస్తున్న ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేసి, అనుకున్న మేరకు జనవరి నెలాఖారు కంతా పూర్తి చేయాలని, ఫిబ్రవరిలో లబ్ధిదారులకు అందజేసేలా గృహప్రవేశాలకు సిద్దం చేయాలన్నారు. ఇటుకల కొరత రాకుండా ఇటుకలు తయారు చేసే వారితో ముందే అగ్రిమెంట్ చేసుకోవాలని, అదేవిధంగా సిమెంట్, ఇసుక కొరత రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ హరిత సూచించారు. అన్ని లే అవుట్లలో నీరు, కరెంట్ అందుబాటలో వున్నాయని, ఎక్కడైన వాటిపై సమస్యలు వుంటె, తక్షణమే మరమ్మత్తులు చేయించి సిద్దంగా వుంచుకోవాలన్నారు. ఇంజనీరింగ్, హౌసింగ్ అధికారులు సమన్వయంతో ఇంటి నిర్మాణ కంట్రాక్టర్లతో పనులు చేయించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఓ.ఎస్.డి రామచంద్రా రెడ్డి, పి.డి వెంకటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలు పాల్గొన్నారు.

## నేడు శభాష్ పురంకు ఎమ్మెల్యే రాక...

### - సచివాలయాల కన్వీనర్ హనుమంతు

**తుగ్గలి** తుగ్గలి మండల పరిధిలోని శభాష్ పురం గ్రామానికి పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి విచ్చేస్తున్నట్లు మండల సచివాలయాల కన్వీనర్ ఆర్.హనుమంతు, సర్పంచ్ సలహాదారుడు జి.రవి లు తెలిపారు.గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు,వైయస్సార్ రైతు భరోసా,వైయస్సార్ హెల్త్ సెంటర్, వైయస్సార్ జలకల మోటార్ లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి మండలంలోని వైకాపా నాయకులు,కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు తెలియజేశారు.

## ఓటు వేయడానికి వచ్చి ఇద్దరు వృద్ధుల మృతి


**ఆదిలాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఆదిలాబాద్ పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఇద్దరు వృద్ధులు అస్వస్థతకు గురై మరణించారు.మావల గ్రామానికి చెందిన తోకల గంగమ్మ అనే వృద్ధురాలు (76) పోలింగ్ కేంద్రానికి చేరుకునేలోగా ఫిట్స్‌తో పడిపోయింది. దీంతో ఆమెను రిమ్స్‌కు తరలించగా అప్పటికే మరణించిందని వైద్యులు నిర్ధారించారు.ఇక భుక్తాపూర్‌కు చెందిన రాజన్న (65) ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్నాడు. ఆపై కండ్లు తిరిగి పడిపోవడంతో ఆయనను కూడా రిమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాజన్న ప్రాణాలు కోల్పోయారు.

## కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు..
## ఏడుగురు కార్మికులు సజీవ దహనం

**అహ్మదాబాద్ :** కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు జరిగింది. మంటల్లో కాలి ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో 27 మంది కార్మికులకు కాలిన గాయాలయ్యాయి. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ సంఘటన జరిగింది. ఏథర్ ఇండస్ట్రీస్‌లో బుధవారం
తెల్లవారుజామున కెమికల్ స్టోరేజీ ట్యాంకులో మంటలు చెలరేగాయి. దీంతో భారీగా పేలుడు సంభవించింది. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు పదుల సంఖ్యలో గాయపడ్డారు. మరికొందరు అదృశ్యమయ్యారు.కాగా, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిన తర్వాత అదృశ్యమైన కార్మికుల కోసం గురువారం వెతికారు. ఈ నేపథ్యంలో ఏడుగురు కార్మికులు కాలి బూడిదిగా మారినట్లు గుర్తించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపారు. గుజరాత్‌లోని అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల్లో ఒకరు, 1.3 మిలియన్ డాలర్ల సంపద ఉన్న అశ్విన్ దేశాయ్‌కు చెందిన కంపెనీగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

# బ్యాలెట్లలో భవితవ్యం

**హైదరాబాద్ :** తెలంగాణలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లు తమ నిర్ణయాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేస్తున్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం ఎన్నికలు ముగిశాయి. తెలంగాణ ఎన్నికలు జరుగుతున్నాయి. డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఫలితాలే వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపుతాయి. తెలంగాణలో ఓటింగ్ ముగిసిన తర్వాత సాయంత్రంలోగా వెలువడే ఎగ్జిట్ పోల్ అంచనాలపైనే అందరి దృష్టి ఉంటుంది.అధికార భారత రాష్ట్ర సమితిని గద్దె దించేందుకు విపక్ష కాంగ్రెస్, బీజేపీ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కాంగ్రెస్ అయితే బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అన్నట్లుగా ప్రచారం నిర్వహించింది. ఇక చివరకు ప్రచారంలో బీజేపీ కూడా జోరు పెంచింది. వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తుండగా, రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ గట్టిపోటీనిస్తోంది. మరోవైపు రాష్ట్రంలో తన ఉనికిని చాటుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ ప్రచారం ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలోని అవినీతిని లక్ష్యంగా చేసుకుంది.



## కాంగ్రెస్‌కు ఆ రెండు బీజేపీకి ఈ రెండు

దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్ సంస్థలూ తేల్చేశాయి. అలాగే బీజేపీ రెండోస్థానంతో సరిపెట్టుకోవాల్సిందేనని కూడా స్పష్టం చేస్తున్నాయి. ఏ ఎగ్జిట్ పోల్ కూడా కాంగ్రెస్ ముందంజలో లేదని చెప్పకపోవడం ఇక్కడ విశేషం. మరోవైపు ఐదేళ్లకోసారి అధికారాన్ని మార్చే సంప్రదాయం ఉన్న రాజస్తాన్ లో ఈసారి అధికార కాంగ్రెస్ పార్టీకి చుక్కెదురు కావడం ఖాయమని దాదాపు అన్ని సర్వేలు తేల్చిచెప్పేశాయి. ఇక్కడ విపక్షంలో ఉన్న బీజేపీ ఈసారి 100 సీట్లకు పైగా సాధించి అధికారంలోకి రావడం ఖాయమని కూడా చెబుతున్నాయి. ప్రధాని మోడీ వర్సెస్ అశోక్ గెహ్లాట్ గా మారిన ఈ ఎన్నికల్లో బీజేపీ ఆధిక్యంలో ఉన్నట్లు అన్ని ఎగ్జిట్ పోల్స్ తేల్చిచెప్పాయి. ఈ ఒక్క రాష్ట్రంలో బీజేపీ స్పష్టమైన విజయం సాధించేలా కనిపిస్తోంది.అటు హిందీ హార్ట్ ల్యాండ్ గా చెప్పుకునే మధ్యప్రదేశ్ లో హెూరాహెూరీ పోరు జరిగిందని ఎగ్జిట్ పోల్ ఫలితాలు స్పష్టం చేశాయి. అయితే ఇక్కడ బీజేపీ స్వల్ప ఆధిక్యం సాధిస్తుందని మెజార్టీ సర్వేలు చెబుతున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ కూడా ఆధిక్యం అందుకునే అవకాశం ఉందని దైనిక్ భాస్కర్, జన్ కీ బాత్ వంటి మరికొన్ని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. అయితే కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండటం ఇక్కడ ఆ పార్టీకి బాగానే కలిసి వచ్చిన్నట్లు అర్ధమవుతోంది. ఈ ఉత్కంఠకు తెరపడాలంటే డిసెంబర్ 3 వరకూ ఆగాల్సిందే. ఇక చివరిగా ఈశాన్య రాష్ట్రం మిజోరంలో మాత్రం జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ పాత్ర నామమాత్రమే. స్థానిక పార్టీలైన ఎంఎన్ఎఫ్, జడ్పీఎం మధ్య హెూరాహెూరీ పోరు సాగింది. అయితే వీరిద్దరిలో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నా కాంగ్రెస్ కీలకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మిజోరంలో కాంగ్రెస్ అధికార భాగస్వామి అవుతుందన్న అంచనాలు కూడా ఉన్నాయి.

## డిసెంబర్ 12వ తేదీకి చంద్రబాబు కేసు వాయిదా

ఇబ్బడిమబ్బడి కేసుల గురించి అటు ఏసీబీ కోర్టులో ఇటు హైకోర్టులో సుప్రీంకోర్టులో అదే పనిగా విచారణకు వస్తున్నాయి. కానీ క్వాష్ పిటిషన్ పై తీర్పు రాని కారణంగా వాయిదా పడుతూ వస్తున్నాయి. చివరికి చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ కూడా ఈ కారణంగానే వాయిదా పడింది. ఆ కేసు పదకొండో తేదీకి వాయిదా పడింది. హైకోర్టులో కూడా వివిధ కేసుల్లో ముందస్తు బెయిల్స్ పై విచారణ కూడా వాయిదాల మీద వాయిదాలు పడుతుంది.

### క్వాష్ పిటిషన్ తీర్పుపై ఉత్కంఠ

క్వాష్ పిటిషన్ తీర్పు చంద్రబాబుకు అనుకూలంగా వస్తే ఆయన పై పెట్టి నకేసులన్నీ అక్రమం అని తేలుతాయి. కోర్టుల్లో ఉన్నవన్నీ తేలిపోతాయి. వాటికి విచారణ అర్హత కూడా ఉండదు. ఒక వేళ చంద్రబాబుకు 17ఏ వర్తించదని సుప్రీంకోర్టు చెబితే మాత్రం.. అన్ని కేసుల్లో విచారణలు దాదాపుగా పూర్తయినందున తీర్పులు వెల్లడించాల్సి ఉంటుంది. ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో చంద్రబాబును రాజకీయానికి దూరం చేయాలనుకుంటున్న జగన్ రెడ్డి పన్నాగాలు వర్కవుట్ అవుతాయా లేదా అన్న క్వాష్ పిటిషన్ పై తీర్పును బట్టి వెల్లడయ్యే అవకాశం ఉండటంతో అందరిలోనూ ఆసక్తి ఏర్పడింది.

## నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద మరోసారి ఉద్రిక్తత

గురువారం రాత్రి తెలంగాణ పోలీసులు భారీగా సాగర్ డ్యామ్ వద్దకు చేరుకున్నారు. అయితే డ్యామ్ నిర్వహణ నీటిపారుదల సంబంధిత విషయమని, కంచెను తీసివేయాలని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి ఏపీ పోలీసులను కోరినా ఏ ఫలితం కనిపించలేదు. మరోవైపు బుధవారం రాత్రి ఏపీ అధికారులు సాగర్ ప్రాజెక్ట్ కుడి కాలువ నుంచి 2 వేల క్యూసెక్కుల నీటిని దౌర్జన్యంగా విడుదల చేయడం తెలిసిందే.

### బుధవారం అర్ధరాత్రి నుంచే హైడ్రామా..

నాగార్జున సాగర్ కుడి కాల్వ వద్ద బుధవారం రాత్రి నుంచే హైడ్రామా జరుగుతోంది. ఏపీ పోలీసులు ప్రాజెక్టు 26 గేట్లలో సగమైన 13వ గేట్ వరకు తమ పరిధిలోకి వస్తుందన్నారు. దాదాపు 500 మంది పోలీస్ సిబ్బందితో బుధవారం అర్ధరాత్రి సాగర్ డ్యామ్ 13 గేట్ వరకు చేరుకుని ముళ్ల కంచె వేశారు. బారీకేడ్లను సైతం ఏర్పాటు చేయడంతో పాటు డ్యామ్ భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది.

## 70 సీట్లు తగ్గకుండా గెలుస్తాం

ఓటింగ్ ఎంత శాతం జరిగిందనేది తేలలేదు. కానీ కొన్ని సంస్థలు ఎగ్జిట్ పోల్స్ అని దుష్ప్రచారం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. 2018లో ఒక్క ఏజెన్సీ మాత్రమే సరైన ఎగ్జిట్ పోల్స్ ఇచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ ఎన్నికల్లో విజేత ఎవరనేది డిసెంబర్ 3వ తేదీన తేలుతుందన్నారు. గత మూడు నెలలుగా పార్టీ గెలుపు కోసం కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.గత ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి 48 సీట్లు వస్తాయని ఒకరు, 50 సీట్లకు పరిమితమని మరో సంస్థ చెప్పిందన్నారు. కానీ 2018లో తాము 88 సీట్లతో ఘన విజయం సాధించామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తాజాగా వచ్చిన ఎగ్జిట్ పోల్స్ లో నాలుగు ఏజెన్సీలు తప్పుడు విషయాలు ప్రచారం చేస్తున్నాయి, ఒక్క ఏజెన్సీ సరైన ఫలితాలు అంచనా వేస్తుందన్నారు. కొందరు ఓటర్లు ఇంకా క్యూ లైన్లలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ మాత్రం తమకు అనుకూల ఎగ్జిట్ పోల్స్ వచ్చేలా చేసిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ గెలుస్తుందని వచ్చిన ఎగ్జిట్ పోల్స్ తప్పు అని డిసెంబర్ 3న నిరూపిస్తాం. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కనీసం 70 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను చెప్పింది నిజమో కాదో మరో మూడు రోజుల్లో తేలిపోతుందన్నారు. దాదాపు 90 సీట్లు నెగ్గుతామని మొదట్లో తాము భావించగా, కొన్ని కారణాలతో 70 సీట్లు నెగ్గుతున్నామని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎగ్జి పోల్స్ పేరిట న్యూసెన్స్, నాన్ సెన్స్ చేసే వారికి డిసెంబర్ 3న నిజాలు తెలుస్తామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## కేసీఆర్‌ను ఓడగొట్టినందుకు ధన్యవాదాలు

గతంలో పోలింగ్ ముగియగానే కేసీఆర్ వచ్చేవారు కానీ ఓటమి ఖాయమని తెలిసే కేసీఆర్ ముఖం చాటేశారని విమర్శించారు. కేటీఆర్ కూడా త్వరలోనే అమెరికాకు వెళ్లిపోతారని జోస్యం చెప్పారు రేవంత్. అధిష్ఠానం సూచన ప్రకారం సీఎల్పీ సమావేశం నిర్వహిస్తామని రేవంత్ తెలిపారు. సీఎల్పీలో చర్చించి ప్రభుత్వ ఏర్పాటు తేదీని నిర్ణయిస్తామన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్‌కు కీలక బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఎంఐఎం ప్రస్తుతం బీజేపీతో ఉందని.. అందుకే మైనార్టీలను ప్రభుత్వంలో కలుపుకొని పోతామని అన్నారు. మెజార్టీల పట్ల ఉన్న విధానమే మైనార్టీల పట్ల ఉంటుందన్నారు. తెలంగాణ గెలుపులో కాంగ్రెస్ అగ్రనాయకత్వానిది కీలకపాత్ర అని చెప్పారు.బీఆర్ఎస్ నేతలది మేకపోతు గాంభీర్యమని ప్రజలంటే వారికి చిన్నచూపు ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు డిసెంబర్ 3 వరకు ఆగాల్సిన పనిలేదని ఈరోజు నుంచే సంబురాలు చేసుకోవచ్చున్నారు రేవంత్. పారదర్శక ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల్లో విపక్షాల అభిప్రాయాలకు విలువ ఉంటుందన్నారు. కేసీఆర్‌లాగా నిరంకుశంగా కాంగ్రెస్ నేతలు ఉండరన్నారు. ప్రజల సమస్యలు చూపించే మీడియాకు కూడా స్వేచ్ఛ ఉంటుందని స్పష్టం చేశారు. తాము పాలకులుగా ఉండమని సేవకులుగా ఉంటామని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ చూసి కేటీఆర్ వచ్చి భయపెట్టే ప్రయత్నం చేశారన్నారు రేవంత్. మరి ఎగ్జిట్ పోల్స్ నిజమైతే కేటీఆర్ ప్రజలకు క్షమాపణలు చెబుతారా? అని రేవంత్ సవాల్ విసిరారు. కేసీఆర్ వచ్చి మాట్లాడాడు అంటే దుకాణం బంద్ అయినట్లేనని కేసీఆర్ మోహం చాటేశారన్నారు. కాగా, ఎగ్జిట్ పోల్స్ చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. డిసెంబర్ 3న ఫలితాల్లో బీఆర్ఎస్ 70కిపైగా సీట్లు గెలుచుకుంటుందన్నారు కేటీఆర్. ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మాల్సిన పనిలేదన్నారు. 3న ఫలితాలు తారుమారైతే ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసిన సంస్థలు ప్రజలకు క్షమాపణలు చెబుతాయా? అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే రేవంత్ కేటీఆర్‌కు సవాల్ విసిరారు

## తెలంగాణలో మొత్తంగా 70.60 శాతం పోలింగ్

అశ్వారావుపేట, భద్రాచలం నియోజక వర్గాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆ ప్రకారం..

ఈ ప్రాంతాల్లో మొత్తం 600 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. 4 గంటలలోపు క్యూలో ఉన్నవారిని ఓటు వేయడానికి అధికారులు అనుమతిస్తున్నారు.

### ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి స్పెషల్ లీవ్: వికాస్ రాజ్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం నవంబర్ 29, 30 తేదీలలో పోలింగ్ విధులు నిర్వహించిన సిబ్బందికి శుక్రవారం ప్రత్యేక సెలవు ప్రకటించారు

. స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక సెలవు ఇవ్వాలని వికాస్ రాజ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## తెలంగాణలో కర్ణాటక సీన్ రిపీట్ అవుతుందా.?

కాంగ్రెస్ పార్టీ నిరంతరంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలను తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సద్వినియోగం చేసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వ తీరును తెలంగాణ ప్రజలకు వివరిస్తూ తెలుగు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు.కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలను తెలంగాణ కాంగ్రెస్ ప్రజల ముందు పెట్టారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండుతున్న సమయంలోనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బెంగళూరు చేరుకుని సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ తో చర్చించి తరువాత హైదరాబాద్ వెళ్లి అసెంబ్లీ ఎన్నికలకు అన్ని రకాలుగా రంగం సిద్ధం చేసుకున్నారు. ఇదే సమయంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును వివరిస్తూ తెలంగాణలోని దిన పత్రికల్లో ప్రకటనలు విడుదల చేశారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ప్రజలకు ఇచ్చిన ఐదు వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే నెరవేర్చామని కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజల్లోకి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రకటనలపైను బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండిపడ్డాయి. అయితే అప్పటికే కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుకున్న విదంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పూర్తి చేశారు.కర్ణాటకలో 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఏది ఏమైనప్పటికీ కర్ణాటకలో కాంగ్రెస్ విజయం తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో ప్రతిధ్వనించింది. ఈ పక్కాప్లాన్ పట్ల తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ సభలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారుల మనోధైర్యాన్ని పెంచిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణ శాసనమండలి సభ్యుడు ఒకరు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు మొదలుకావడానికి, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రతికూల వాతావరణం ఏర్పడటానికి కర్ణాటకలో సాధించిన విజయం దోహదపడిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరుస పరాజయాలు రావడంతో ఆ పార్టీ షాక్‌కు గురైంది. అయితే పొరుగున ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఊపునిచ్చిందనే గుసగుసలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ పుంజుకుందన్న భావన ప్రజల్లో కలుగుతోందని పార్టీలకు అతీతంగా కొందరు నాయకులు అంటున్నారు. కర్ణాటక ఎన్నికలకు ముందే తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్‌పై నమ్మకం పోయిందని తెలంగాణ నాయకుడు ఎం.కోదండరామ్ ఇటీవల అన్నారు. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఎగ్జిట్ పోల్స్ సర్వేలు చెప్పాయి. కర్ణాటక తరహాలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. కర్ణాటకలో అధికారం నుంచి దిగిపోయిన బీజేపీకి ఇప్పుడున్న పరిస్థితుల్లో తెలంగాణలో అవకాశం లేదని కోదండరామ్ అన్నారు. ఇదే విషయం గురువారం సాయంత్రం విడుదల అయిన ఎగ్జిట్ పోల్స్ కూడా స్పష్టం చేశాయి. మొత్తం మీద కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించడంతో తెలంగాణ ప్రజలు ఎవరికి పట్టాభిషేకం చేశారు అనే విషయం డిసెంబర్ 3వ తేదీన ఆదివారం తేలిపోతుంది.

## బీఆర్ఎస్ నేతలు దౌర్జన్యం చేస్తున్నారు

**రాజన్న సిరిసిల్ల** నా అభివృద్ధిని చూసి ఓటేస్తారు అన్న కేటీఆర్ ఈరోజు సిరిసిల్లలో డబ్బు మద్యం పంచుతూ తన నాయకులతో దౌర్జన్యం చేస్తు డబ్బులు పంచుతున్న వీడియోలను సిరిసిల్ల శాసనసభ అభ్యర్థి రాణి రుద్రమ మీడియా ముందు పెట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల బిజెపి అభ్యర్థిగా పోటీలో ఉన్న రాణి రుద్రమ ఈరోజు సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించారు..ఇందులో భాగంగా టిఆర్ఎస్ సంబంధించినటువంటి నాయకులు కార్యకర్తలు ఓటర్లను మభ్యపెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తూ దౌర్జన్యంగా డబ్బులు పంచుతున్నారని.. అసలు నా అభివృద్ధిని చూసి ఓటేస్తా అన్న కేటీఆర్ ఈరోజు డబ్బులు, మద్యం పంచడాన్ని తన పార్టీలో ప్రోత్సహిస్తున్నారని,ఓటమి భయంతోనే కేటీఆర్ తన నియోజకవర్గంలో డబ్బులను పంచుతున్నారని.. గమనించిన బిజెపి కార్యకర్తలను చూసి వాళ్ళు పారిపోయారని తెలిపారు

## రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు...

**హైదరాబాద్ :** పోటీ ఏదైనా బెట్టింగ్ ఖాయం అన్నట్లుగా ప్రస్తుత పరిస్థిత ?మారిపోయింది. తెలంగాణ ఎన్నికలపైనా అదే విధమైన బెట్టింగ్‌లు జరుగుతున్నయి. క్రికెట్, ఇతరత్రా పోటీలపై బెట్టింగులు నిర్వహించిన ఆన్లైన్ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు.. ఇప్పుడు ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై వాటి కన్ను పడింది. తెలంగాణ ఎన్నికల ఫలితాలపై బరిలోకి దిగిన పందెం రాయుళ్లు? కాయ్ రాజా కాయ్ అంటూ జోరుగా బెట్టింగ్స్ కాస్తున్నారు. ఈ సారి పలానా పార్టీ అధికారంలోకి రాబోతోందని, పలానా నియోజకవర్గంలో పలానా అభ్యర్థి గెలవబోతున్నారంటూ భారీగా పందాలు వేస్తున్నారు. వందకు వెయ్యి, వెయ్యికి లక్ష అంటూ బెట్టింగ్ బంగార్రాజులు పందేలు కాస్తున్నారు. పెద్ద లీడర్లు తలపడుతున్న నియోజకవర్గాల్లో ఎవరికి ఎంత మెజార్టీ వస్తుందన్న పందేలు కూడా కాస్తున్నారు. లక్షలు కాదు.. కోట్లలో బెట్టింగ్స్ జరుగుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో ఏ పార్టీ గెలుస్తుంది. ఎవరు అధికారంలోకి రాబోతున్నారు. రాష్ట్రంలో ఎవరిని చూసినా ఇదే చర్చ. ఊరు వాడా, పల్లె పట్నం అని తేడా లేకుండా ప్రతి గల్లిలోనూ ఏ నలుగురు గుమిగూడినా ఇదే చర్చ. తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల్లో ఏ పార్టీ, ఎన్ని సీట్లు సాధిస్తుందనే అంచనాలపై వేర్వేరు బెట్టింగ్ సంస్థలు పందేలు నిర్వహిస్తున్నాయి. ప్రముఖులు ప్రచారకర్తలుగా ఆయా సంస్థల వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లకు విస్తృత ప్రచారం కల్పిస్తుండటం, వెబ్‌సైట్లు, బస్టాపులు, ఆటోలపై వారి ప్రకటనలు ప్రదర్శిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీలు ఎన్ని స్థానాల్లో గెలుస్తాయి.. ఎన్ని సీట్లతో సరిపెట్టుకుంటాయి. అంటూ ఆన్‌లైన్ బెట్టింగ్ సంస్థలు ప్రకటనలు ప్రదర్శిస్తున్నాయి. డిసెంబరు 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయని.. పందెంలో గెలిచిన వారు అంతకంత డబ్బు సంపాదించుకోవచ్చని ఊరిస్తున్నాయి. ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిత్యం రకరకాల ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే బెట్టింగ్ సంస్థలు అంతకు మించి హడావుడి పెంచాయి. తెలంగాణలోనే కాదు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సర్వేలు చేయించి మరీ పందాలు కాస్తున్నారు బుకీలు. కేసీఆరే సీఎం అవుతారని.. హంగ్ వస్తుందని.. కాంగ్రెస్ గెలుస్తుందంటూ కోట్లాది రూపాయల్లో బెట్టింగులు కాస్తున్నారు. బీఆర్ఎస్.. కాంగ్రెస్ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయనే దాని పైన కూడా పందాలు జరుగుతున్నాయి. రేవంత్ రెడ్డి రెండు చోట్ల గెలుస్తాడా... కేసీఆర్ కు ఎంత మెజార్టీ వస్తుంది.. కోమటిరెడ్డి బ్రదర్స్, మైనంపల్లి గెలుస్తారా లేదా అన్న అంశాలపైనా బెట్‌టంగ్ జరుగుతోంది. మూడో తేదీ లోపు వేల కోట్ల బెట్టింగ్ జరిగే అవకాశం ఉందని అంచనా .

## ఏపీలో కొత్త పార్టీ...

**విశాఖపట్టణం :** జేడీ లక్ష్మీనారాయణ కొత్త పార్టీ పెట్టే యోచనలో ఉన్నారు. ఈ మేరకు ఆయన మీడియాకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో రానున్న ఎన్నికల్లో కొత్త పార్టీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. కొత్త పార్టీల అవసరం ఏపీలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న రెండు పార్టీల పాలనను ప్రజలు చూశారని, అయితే ఎవరు వచ్చినా రాష్ట్రాభివృద్ధి ఆశించినంత మేర జరగడం లేదని ప్రజలు ఎక్కువ మంది ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారని జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. దీనిపై మేధావులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అందరితో మాట్లాడిన తర్వాత కొత్త పార్టీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జేడీ లక్ష్మీనారాయణ గత లోక్‌సభ ఎన్నికల్లో జనసేన పార్టీ తరుపున విశాఖ పార్లమెంటుకు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈసారి ఏ పార్టీలో చేరతారన్న ఉత్కంఠకు ఆయన తెరదించారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో జనసేన తరపున విశాఖ నుంచి పార్లమెంట్ కు పోటీ చేశారు. మూడో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత పవన్ కల్యాణ్ సినిమాలు చేస్తున్నరన్న కారణం చూపి ఆయన పార్టీకి రాజీనామా చేశారు. తర్వాత స్వచ్ఛంద సంస్థ పెట్టుకుని వ్యవసాయ అంశాలపై పని చేస్తున్నారు. విశాఖలోనే మళ్లీ పోటీ చేయాలని నిర్ణయించుకున్న ఆయన పలు అంశాలపై స్పందిస్తున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేసు వేసి పోరాడుతున్నారు. అయితే ఆయన అన్నిపార్టీలనూ పొగుడుతూండటంతో ఎప్పటికప్పుడు ఆయన ఫలానా పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారం జరుగుతూ వస్తోంది. విశాఖలో జేడీ ఫౌండేషన్, నిపుణ హ్యూమన్ డెవలప్మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 2న విశాఖలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ జాబ్ ఫేర్‌లో 50కు పైగా కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు.సెలెక్ట్ అయిన వారికి అక్కడికక్కడే ఆఫర్ లెటర్లను ఇస్తామని వెల్లడించారు. పదో తరగతి, ఆపై విద్యార్హత ఉన్నవారు జాబ్ మేళాకు హాజరు కావచ్చని చెప్పారు. కొంచెం వెనుకబడిన అభ్యర్థులకు స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ ను నిర్వహిస్తామని తెలిపారు.తాను కొత్త పార్టీ పెట్టి ఆ పార్టీ తరుపునే విశాఖ పార్లమెంటు నుంచి పోటీ చేయడానికి ఆయన సిద్ధమవుతున్నారని సమాచారం.బీఆర్ఎస్ పార్టీలో చేరుతారని ఏపీ అధ్యక్ష పదవి తీసుకుంటారని ప్రచారం జరిగింది. కేసీఆర్ నిర్ణయాలను పలుమార్లు ప్రశంసించారు. కానీ తర్వాత అలాంటిదేమీ లేదని ప్రకటించారు. ఓ సారి వైసీపీ అధినేత ను కూడా ప్రశంసించారు. దాంతో ఆయన వైసీపీలో కూడా చేరుతారని ప్రచారం జరిగింది. కానీ ఆ విషయాన్నీ ఆయన ఖండించారు. టీడీపీలో చేరే విషయంపై ఎప్పుడూ రూమర్స్ రాలేదు కానీ మళ్లీ జనసేనలో చేరుతారన్న చర్చ అయితే జరిగింది. కానీ పవన్ ఆయనను ఆహ్వానించలేదు... ఆయన కూడా పవన్ ను పార్టీలోకి వస్తానని అడగలేదు. ఈ కారణంగా పెండింగ్ పడిపోయింది. చివరిగా ఆయన సొంత పార్టీ ఆలోచన చేస్తున్నారు.

## ట్రూ అప్ భారం 7,500 కోట్లు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ కొరత కారణంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున బయట మార్కెట్ నుంచి కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేస్తోంది. ఈ కారణంగా ప్రజలపై పెనుభారం పడే అవకాశాలు కనిపిస్తున్నయి. ఇప్పుడు కొత్తగా విద్యుత్ వినియోగదారులపై మరో ట్రూఅప్ భారం పడనుంది. ఇప్పటికే రెండు ట్రూఅప్‌లు భారం మోపిన డిస్కమ్‌లు ముచ్చటగా మూడోసారి మోపేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఒక బిల్లులో మూడు రకాలైన భారాలను వసూలు చేస్తున్నాయి. కొత్తగా రూ.7,200 కోట్లు వసూలు చేసేందుకు ఎపిఇఆర్‌సికి డిస్కమ్‌లు ప్రతిపాదనలు పంపాయి. ఏపీ ప్రజలపై ఇప్పటికే ఓ ట్రూ అప్, రెండు ఇంధన సర్ చార్జీలను వడ్డించారు. త్వరలో నాలుగో భారం పడనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రూఅప్ ప్రతిపాదనలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి ఇటీవల డిస్కమ్‌లు సమర్పించాయి. ఇఆర్‌సి అనుమతించిన దాని కంటే అదనంగా విద్యుత్ కొనడం వల్ల ఈ ఖర్చును వసూలు చేయదలిచినట్లు ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి. ఇపిడిసిఎల్ రూ.2,800 కోట్లు, ఎస్‌పిడిసిఎల్ రూ.2,500 కోట్లు, సిపిడిసిఎల్ రూ.1,900 కోట్లు చొప్పున ప్రతిపాదించినట్లు సమాచారం. వీటిపై విచారణ జరిపిన అనంతరం ఎంత భారం వేయాలనేది ఎపిఇఆర్‌సి నిర్ణయిస్తుంది. దీనికోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో మూడు డిస్కమ్‌ల పరిధిలో 1.91 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. అదనపు భారాలతో జనం గగ్గోలుఇప్పటికే విద్యుత్ బిల్లులు మోత మోగుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం లెక్క చేయడం లేదు. డిస్కమ్‌లు రెండు ట్రూఅప్‌ల రూపంలో రూ.5,993 కోట్లను వసూలు చేస్తున్నాయి. 2014-19 కాలానికి సంబంధించిన ట్రూఅప్ రూ.2,910 కోట్లను 2022 ఆగస్టు నుంచి వసూలు చేస్తున్నాయి. ఇది కాకుండా 2021-22 సంవత్సరం ట్రూఅప్ రూ.3,083 కోట్లను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వసూలు చేస్తున్నాయి. ఇవి చాలవన్నట్లు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా నెలనెలా ట్రూఅప్ విధానం మే నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పేరుతో నెలకు యూనిట్‌కు రూ.0.40 పైసలు వసూలు చేస్తున్నాయి. ఈ భారం ఏడాదికి మూడువేల కోట్లపైనే ఉంది. నెల నెలా విధానం కాకుండా మరలా ఏడాది ముగిసిన తరువాత కూడా డిస్కమ్ లోటును భర్తీ చేసుకునేందుకు అదనపు వసూళ్లకు అవకాశం ఉంది. ఇప్పటికే వాడిన విద్యుత్‌తో పాటు అదనంగా ట్రూఅప్‌లు, ఇంధన సర్దుబాటు ఛార్జీలకే వినియోగదారులు 40 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తోంది.సీఎం జగన్ నాలుగున్నరేళ్ల కిందట ప్రమాణస్వీకారం చేసినప్పుడు కరెంట్ రేట్లు భారీగా తగ్గించేస్తానని ప్రకటించారు. తీరా చూస్తే.. ఇప్పుడు కరెంట్ బిల్లులు రెట్టింపు అయ్యాయన్న విమర్శలు వస్తున్నాయి. కరెంట్ ఉత్పత్తిపై దృష్టి పెట్టకుండా.. పీపీఏలు రద్దు చేయడం, బొగ్గు నిల్వలు సరిపడా ఉంచుకోకపోవడం తో కరెంట్ సమస్యలు వస్తున్నాయని అధిక రేటుకు బయట మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఆ భారం అంతా.. మళ్లీ ప్రజలపైనే వేస్తున్నారు. దీనిపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఎన్నికలు మరో వంద రోజుల్లో ఉన్నాయని భావిస్తున్న సమయంలో ప్రజలపైమరో సారి భారం మోపుతుందా వెనక్కి తగ్గుతుందా అన్నది చూడాల్సి ఉంది.

## పొత్తులు..ఎత్తులు షురూ...

**కడప :** మ్ములాట వల్ల ఆ సీటు జనసేన ఖాతాలోకి వెళ్లిపోనుందా..! కేడరే లేని జనసేనకు కొత్త నాయకులు తెరమీదకి రాబోతున్నారా ..? ఆ నియోజకవర్గంలో పరిస్థితులు చూస్తుంటే అలానే అనిపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు స్తబ్దుగా ఉన్న జనసేన నేతలు ఇప్పుడు కడప జిల్లాలోని రాజంపేట నియోజకవర్గంపై కన్నేశారు. రాయలసీమలో జనసేనకు ఇచ్చే అతి తక్కువ సీట్లలో రాజంపేట ఒకటిగా కనబడుతుంది. కాపు సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్న ఆ నియోజకవర్గం నుంచి తమ అభ్యర్థిని పోటీకి సిద్ధం చేయాలని చూస్తుంది జనసేన.ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట రాజకీయాలకు ప్రత్యేక స్థానం ఉంది. రాజంపేటలో ఏ పార్టీ గెలిస్తే, ఆ పార్టీనే రాష్ట్రంలో అధికారంలో ఉంటుంది అనేది పార్టీల నమ్మకం. అందుకే రాజంపేటలో గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తూ ఉంటారు. అందులో భాగంగానే ఈసారి ఇక్కడ తెలుగు దేశం పార్టీ గట్టి నాయకత్వం కోసం ఎదురు చూస్తుంటే, నేతలంతా టికెట్ల కోసం కుమ్ములాటలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి రాజంపేట సీటును జనసేనకు కేటాయించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాక జనసేన కూడా రాజంపేట సీటుపై గట్టిపట్టు మీద ఉన్నట్లు సమాచారం. కాపు సామాజిక వర్గం ఓటర్లు ఇక్కడ అధిక సంఖ్యలో ఉండటంతో ఈ సీటును జనసేనకు కేటాయించాలని చర్చలు కూడా జరిగాయట. ఇప్పటివరకు జనసేనకు నాయకులు లేకపోయినా పార్టీని ముందుకు నడిపించేవారు లేకపోయినా సీటు మాత్రం కావాలని జనసేన పట్టుబట్టినట్లు సమాచారం.అయితే జనసేనకు సీటు వస్తుందనుకున్న తరుణంలో కొంతమంది నేతలు జనసేనలో చేరడానికి సిద్ధంగా ఉన్నారట. టికెట్ ఇస్తే ఖర్చు పెట్టుకుంటామని ఈసారి ఇక్కడ టీడీపీ గానీ, జనసేన గానీ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అందుకే ఈ సీటుపై ఇరు పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో టీడీపీ, జనసేన మధ్య పొత్తు కుదరడం, స్థానికంగా టీడీపీలో టికెట్ కోసం కుమ్ములాటలు నెలకొన్న పరిస్థితుల్లో రాజంపేట సీటు జనసేనకు ఇచ్చేందుకు టీడీపీ అదిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. రాజంపేటలో జనసేన తరపున పోటీ చేసేందుకు మాజీ డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి యల్లటూరి శ్రీనివాసరాజు బరిలోకి దిగేందుకు సిద్దమవుతున్నారట. అందులో భాగంగానే రాజంపేటలో జనసేన తరపున పలు కార్యక్రమాలను చేసుకుంటూ ముందుకు వెళుతున్నారట. త్వరలో అధికారికంగా జనపార్టీలో చేరుతారన్న టాక్ వినిపిస్తోంది.రాజంపేట టీడీపీలో టిక్కెట్ల కుమ్ములాటలో నాలుగు నుంచి ఐదు మంది పోటీ పడుతున్నారు. ముఖ్యంగా నియోజకవర్గ ఇంచార్జ్ బత్యాల చెంగల్ రాయుడుతో పాటు మేడా విజయ శేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రాజు, గంటా నరహరి వీరంతా టీడీపీ రాజంపేట టికెట్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇంతమంది టికెట్ రేసులో ఉన్నారు కాబట్టి వీళ్ళందర్నీ సర్ది చెప్పే కన్నా, ఈ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తే మంచిదని టీడీపీ అధిష్టానం యోచిస్తున్నట్టు సమాచారం. గతంలో 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన మేడా మల్లికార్జున్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి, గెలిచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.జిల్లాల విభజన సమయంలో రాజంపేట జిల్లా కేంద్రం చేసినందుకు అక్కడ నిరసన కార్యక్రమాలు కూడా జరిగాయి. అందులో భాగంగా వైసీపీ ఇక్కడ తప్పకుండా గెలుస్తామని ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది.

ఆ ఆలోచనలో భాగంగానే ఈసారి ఇక్కడ బలమైన అభ్యర్థిని నిలబెట్టి టీడీపీ గెలవాలని అనుకుంటుంది. ఈ తరుణంలోనే పార్టీలో టికెట్ కుమ్ములాటలు ఎక్కువ అవ్వడంతో, జనసేనకే అప్పచెబితే మంచిదన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.ఇక, యల్లటూరు శ్రీనివాసరాజు నందలూరు మండలం పాటూరుకు చెందిన వ్యక్తి కావడంతో సీటుపై ఆశలు పెంచుకుంటున్నారట. ఇంతవరకు జనసేన పార్టీలో డైరెక్ట్‌గా చేరనప్పటికీ, జనసేన నాయకులతో సంబంధాలు మెయింటైన్ చేస్తూ, సీటు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరుతారన్న వార్తలు వినిపిస్తున్నాయి. రాజంపేట సీటును తనకే ఇవ్వాలంటూ శ్రీనివాసరాజు ఇప్పటికే జనసేన నేతలతో సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. ఎప్పుడైతే రాజంపేట సీటు జనసేనకు కేటాయిస్తారనే సమాచారం రావడంతో, కొందరు కీలక నేతలు సైతం జనసేనలో చేరి ఆ పార్టీ టికెట్ కోసం ప్రయత్నించే అవకాశాలు కూడా ఉన్నాయని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.అయితే, ఈసారి రాజంపేట సీటును జనసేన అడుగుతుందనేది మాత్రం స్పష్టంగా అర్థమవుతుంది.

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికే జనసేన టీడీపీ పొత్తులు ఖరారై సీట్లు కూడా కేటాయింపులు జరుగుతున్న నేపథ్యంలో రాజంపేట విషయంలో జనసేన కొంత గట్టిపట్టు మీద ఉన్నట్లు సమాచారం. ఒకవేళ రాజంపేట సీటును జనసేనకు కేటాయిస్తే మొదటి స్థానంలో శ్రీనివాసరాజు ఉండే అవకాశాలైతే కనబడుతున్నాయి. ఒకవేళ టీడీపీనే ఈ స్థానంలో పోటీ చేయాలని అనుకుంటే మాత్రం, ఇప్పటికే టీడీపీ సీటు రేసులో నాలుగు నుంచి ఐదు మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఏది ఏమైనా రాజంపేట సీటును తెలుగు దేశం పార్టీనా, జనసేన అనే విషయం తేల్చాల్సి ఉంది.

## 17ఓట్లను బహిష్కరించిన నల్లబండపాడు గ్రామస్తులు

**భద్రాద్రి కొత్తగూడెం** జూలూరుపాడు మండలం నల్లబండపాడు గ్రామస్తులు గురువారం జరిగిన ఎన్నికలను బహిష్కరించారు. తమ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంపై స్పష్టమైన హామీ వస్తేనే ఓట్లు వేస్తామని భీష్మించు కూర్చున్నారు. మండల కేంద్రానికి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి అనంతారం గ్రామం వరకు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు మార్గం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.
గర్భిణీ లు ఎవరైనా అనారోగ్యం పాలైతే వారిని హాస్పటల్ కు తరలించేందుకు రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో 108 వాహనంతో పాటుగా ఇతర వాహనదారులు సైతం తమ గ్రామానికి రావడంలేదని ఆరోపిస్తున్న గ్రామస్తులు.స్వాతంత్రం రాకముందు ఏర్పడిన తమ గ్రామానికి ఇప్పటివరకు రోడ్డు మార్గం లేదని కానీ ఈ మధ్యకాలంలో ఏర్పడిన గ్రామాలకు రోడ్డు మార్గం ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు.గత ఎన్నికల్లో సైతం ఇదేవిధంగా ఓట్లను ఓట్లను బహిష్కరించామని అప్పుడు కూడా అధికారులు కచ్చితంగా తమ గ్రామానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు తప్ప ఇప్పటివరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదని ఆరోపించారు. పాలకులు అధికారులు రోడ్డు మార్గం నిర్మిస్తామని హామీ ఇస్తున్నారే తప్ప ఏళ్లు గడిచిన ఇప్పటివరకు తమ గ్రామానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేయలేదని ఆరోపించారు.

# పనమ్మాయి కోసం అల్లు అర్జున్ వీడియో

**– ఫాలోవర్లు పెరగాలని ఆశిస్తున్నట్లు వెల్లడి**



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఎంతోమంది హృదయాలను గెలుచుకున్నారు. తను ఒక పెద్ద స్టార్ అయి ఉండీ కూడా, తన ఇంట్లో పనిచేసే ఒక అమ్మాయికి ఫాలోవర్లు పెరగాలని ఉద్దేశంతో ఆ అమ్మాయితో ఒక చిన్న వీడియో చేసి, ఆమెకి ఎక్కువ ఫాలోవర్లు పెరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ వీడియో చూసిన ప్రతి ఒక్కరు అల్లు అర్జున్ ని అభినందించకుండా ఉండలేకపోతున్నారు. ఆమె తన ఫాలోవర్లు ని పెంచుకోవాలని అనుకుంది, అందుకు ఆమె అందుకు తన యజమాని అయిన అల్లు అర్జున్ ని అడిగింది, అతను కూడా సరే అన్నాడు. ఆమెకి ఇప్పటికే పదమూడువేలమంది ఫాలోవర్లు వున్నారని, ఈ అల్లు అర్జున్ వీడియోతో అవి 30 వేలకు పైగా అవుతాయని అనుకుంటున్నట్టుగా చెప్పింది ఆమె. అల్లు అర్జున్ కూడా ఆమెకి బాగా ఫాలోవర్లు పెరగాలని ఆశిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం 'పుష్ప 2' సినిమాతో బిజీగా వున్నా అల్లు అర్జున్, తన ఇంట్లో పనిచేసే అమ్మాయిని పాపులర్ చెయ్యడం కోసం ఈ చిన్న వీడియో చెయ్యడంతో అల్లు అర్జున్ అందరి హృదయాల్ని గెలుచుకున్నారు. ఇప్పుడు ఇది సాంఘీక మాధ్యమంలో విపరీతంగా వైరల్ అవుతోంది.

# ఇంటివాడైన రణ్‌దీప్ హుడా



ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌దీప్ హుడా ఓ ఇంటివాడయ్యాడు. మోడల్, నటి లిన్ లైష్రామ్‌ను ఆయన ప్రేమ వివాహం చేసుకున్నాడు. మణిపూర్ రాజధాని ఇంఫాల్ లోని ఓ దేవాలయంలో వీరి వివాహం నిరాడంబరంగా జరిగింది. మణిపూర్ సంప్రదాయం ప్రకారం ఈ జంట ఒక్కటైంది. ఈ మేరకు పెళ్లి విషయాన్ని తెలియజేస్తూ సోషల్ మీడియా ద్వారా రణ్‌దీప్ హుడా ఫోటోలను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన నెటిజన్లు, పలువురు ప్రముఖులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. లిన్ లైష్రామ్‌తో రణ్‌దీప్ గత కొన్ని రోజులుగా డేటింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాము వివాహం చేసుకోబోతున్నాం అంటూ ఇటీవలే సోషల్ మీడియాలో ప్రకటన చేశారు. 'మహాభారతంలో మణిపూర్ యువరాణి చిత్రాంగదను అర్జునుడు ఎక్కడ వివాహం చేసుకున్నాడో.. అక్కడే మేము ఒక్కటి కాబోతున్నాం. ఈ నెల 29న ఇంఫాల్‌లో కుటుంబసభ్యులు, సన్నిహితులు సమక్షంలో మా (రణ్‌దీప్ హుడా, లిన్ లైష్రామ్) పెళ్లి జరగనుంది. త్వరలోనే ముంబయిలో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నాం. మా ప్రయాణానికి మీ ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాం' అని రణ్‌దీప్ హుడా ఇన్‌స్టాలో రాసుకోచ్చాడు. 2001లో రిలీజైన మన్‌సూన్ వెడ్డింగ్ సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు రణ్‌దీప్ హుడా. ఇక ఆయన నటించిన చిత్రాలలో 'జిస్మ్ 2', 'బాంబే టాకీస్', 'కిక్', 'హైవే' సినిమాలు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇక ప్రస్తుతం బీజేపీ ప్రాపగాండా మూవీ 'స్వతంత్ర వీర్? సావర్కర్' చిత్రంలో నటిస్తున్నాడు.

# యానిమల్ విడుదలపై ఉత్కంఠ

## భారీ కలెక్షన్లపై మేకర్స్ దృష్టి








యానిమల్' సినిమా విడుదలకు ఇంకా ఎంతో సమయం లేదు. విదేశాల్లో ప్రీమియర్ షోలు మరికొన్ని గంటల్లో పడతాయి. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్' తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన సినిమా కావడం, టీజర్ ట్రైలర్‌లలో యాక్షన్ డోస్ ప్రేక్షకులను అట్రాక్ట్ చేయడంతో సినిమాపై విపరీతమైన బజ్ నెలకొంది. అడ్వాన్స్ బుకింగ్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. మరి, సినిమా ఫస్ట్ డే కలెక్షన్స్ ఎలా ఉంటాయన్నదానిపై ఊహాగానాలు చెలరేగుతున్నాయి. రణబీర్ కపూర్ కెరీర్ చూస్తే... 'సంజు', 'బ్రహ్మాస్త్ర' వంటి భారీ విజయాలు ఉన్నాయి. అయితే... అవి మాస్ ఫిలిమ్స్ కావు. కంటెంట్ బేస్డ్ క్లాస్ ఫిలిమ్స్. 'యానిమల్'కు వస్తే అవుట్ అండ్ అవుట్ సందీప్ రెడ్డి వంగా స్టైల్ కమర్షియల్ ఫిల్మ్. ఆల్రెడీ విడుదలైన ప్రచార చిత్రాల్లో సినిమాలో మాంచి మాస్ కంటెంట్ ఉందని ప్రేక్షకుల్లో నమ్మకం కలిగింది. అందుకు తగ్గట్లు బుకింగ్స్ బాగా జరుగుతున్నాయి. 'యానిమల్' హిందీ వెర్షన్ షోస్ ద్వారా 50 నుంచి 55 కోట్ల రూపాయల గ్రాస్ రావచ్చని ఓ అంచనా. మాస్ సినిమాలకు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో బుకింగ్స్ బావుంటాయి. 'యానిమల్'కు మల్టీప్లెక్స్ థియేటర్లలో సైతం బావున్నాయి. పీవీఆర్, ఐనాక్స్ స్క్రీన్లలో రెండున్నర లక్షల టికెట్స్ అమ్మారు. కేవలం వాటి ద్వారా సుమారు ఏడున్నర కోట్ల వరకు వచ్చాయి. ంధప్రదేశ్, తెలంగాణ... రెండు తెలుగు రాష్ట్రాల్లో సైతం 'యానిమల్' అడ్వాన్స్ బుకింగ్స్ బావున్నాయి. తెలుగులో మొదటి రోజు పది కోట్ల రూపాయలు రావచ్చని ఓ అంచనా. ఒక్క హైదరాబాద్ సిటీలో ఫస్ట్ డే కలెక్షన్స్ మూడున్నర కోట్ల నుంచి నాలుగు కోట్ల రూపాయలు ఉంటాయని టాక్.


# డంకీ నుంచి లుట్‌పుట్ గయా పాట విడుదల




షారూక్ ఖాన్, రాజ్‌కుమార్ హిరాణి కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'డంకీ' రీసెంట్‌గా 'లుట్ పుట్ గయా..' అనే సాంగ్‌ను 'డంకీ డ్రాప్ 2'గా మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హార్డీ పాత్రలో షారూక్, మను పాత్రలో తాప్సీ మధ్య ఉండే ప్రేమను తెలియజేసే ఈ పాట ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందనను రాబట్టుకుంది. ఫ్యాన్స్, సినీ ప్రేక్షకులతో పాటు సంగీతాభిమానులు సైతం ఈ పాటకు ఫిదా అయ్యారు. క్రిస్మస్ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున డిసెంబర్ 21న ఈ సినిమా రిలీజ్ కానుంది. అయితే 'జవాన్' సినిమాలో కుస్తీ గ్రౌండ్ మ్యాజిక్‌ను మరోసారి షారూక్ 'డంకీ'లోనూ తాప్సీతో రిపీట్ చేస్తున్నారు. ఈ విషయం తెలిసి నెటిజన్స్ కొందరు సోషల్ మీడియాలో 'జవాన్'లో దీపికాతో.. 'డంకీ'లో తాప్సీతో.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు. షారూక్, దీపిక ల మధ్య 'జవాన్' (ఏజీలిజీని) మూవీలో చూపించిన కుస్తీ సీన్ ఎంత పాపులర్ అయ్యిందో తెలియంది కాదు. ఇప్పుడు అదే మ్యాజిక్‌ను డంకీలోనూ రిపీట్ చేయబోతున్నారు కింగ్ ఖాన్. దీని గురించి ఫ్యాన్స్ చాలా ఎగ్జయిట్ అవుతూ షారూక్ సరికొత్త రొమాంటిక్ పంథాను కనుగొన్నారని మాట్లాడుకుంటున్నారు. హీరోయిన్స్ అందరూ షారూక్ ఖాన్‌తో కుస్తీ చేయాలంటూ నెటిజన్ ఒకతను పోస్ట్ చేశారు. 'డంకీ' చిత్రంలో టాలెంటెడ్ ఆర్టిస్టులు ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు. బోమన్ ఇరాని, తాప్సీ పన్ను, విక్కీ కౌశల్, విక్రమ్ కొచ్చర్, అనీల్ గ్రోవర్ సహా బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్ ప్రేక్షకుల హృదయాలను దోచుకోనున్నారు. ఏ జియో స్టూడియోస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్, రాజ్‌కుమార్ హిరాణి ఫిల్మ్స్ బ్యానర్స్ సమర్పణలో రాజ్ కుమార్ హిరాణి, గౌరి ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# క్యాప్షన్ పెడితే.. సలార్‌కు ఉచిత టిక్కెట్లు




రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులకు, ప్రేక్షకులకు ఓ సువర్ణ అవకాశం! ఆయన నటిస్తున్న తాజా సినిమా 'సలార్' సినిమాను ఫస్ట్ డే ఫస్ట్ షో చూడాలని ఆశ పడుతున్నారా? ఆ షోకి 'సలార్' టీ షర్టులు, క్యాప్ ధరించి వెళితే బాగుంటుందని ఆలోచిస్తున్నారా? అటువంటి వాళ్ళ కోసమే ఈ అవకాశం!సలార్' చిత్రీకరణలో ప్రభాస్కు తన ఫోనులో దర్శకుడు ప్రశాంత్ నీల్ ఏదో చూపిస్తున్న ఫోటోను చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆ ఫోటోకి క్యాప్షన్ ఇవ్వమని అభిమానులను కోరింది. బెస్ట్ క్యాప్షన్ ఇచ్చిన టాప్ 5 నెటిజనులకు తమ తమ ఏరియాలో 'సలార్' ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్స్ ఇస్తామని పేర్కొంది. అంతే కాదు... మర్చండైజ్ కూడా అందిస్తామని వివరించింది. మరికొన్ని గంటల్లో 'సలార్' ట్రైలర్ రిలీజ్ కానుంది. శుక్రవారం... అనగా డిసెంబర్ 1న రాత్రి 7.11 గంటలకు యూట్యూబ్‌లో విడుదల చేయనున్నారు. ట్రైలర్ విడుదలకు ముందు ఈ ఆఫర్ ఇవ్వడమే కాదు... బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్టోరీ కూడా లీక్ చేశారు దర్శకుడు ప్రశాంత్ నీల్!

# ఓటమి అంచులో ఈటెల.?

- అతి ఉత్సాహంతో బిజెపి పార్టీ నాయకులు తప్పు చేశారా.?
- సింగిల్ డిజిట్ దాటే పరిస్థితి లో బిజెపి పార్టీ లేదా.?
- అనుకున్నది ఒక్కటి అయ్యింది ఒక్కటి నష్టం జరిగేది ఎవరికి
- బిజెపి పార్టీ గెలవకపోతే పరిస్థితి ఏమిటి.?
- టికెట్లు తీసుకున్న అభ్యర్థులు ప్రచారంలో పూర్తిగా విఫలం
- బండి సంజయ్ ను తప్పించి భారీ తప్పు చేశారా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో పార్టీలని గెలుపు, ఓటములపై చర్చించుకోవడం ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ నువ్వా నేనా అన్నట్టుగా పోటీపడ్డాయని బిజెపి పార్టీ రాష్ట్ర నాయకుల మాటలు కోటలు దాటిన ఎన్నికల్లో నాయకుల ప్రభావం ఎక్కడ కనిపించలేదని, సింగల్ డిజిట్ తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ దాటుతుందా.? లేదా అని పార్టీ నాయకులు చర్చించుకోవడం చూస్తుంటే బిజెపి పార్టీ అధిష్టానం తెలిసి తప్పు చేసిందా.? తెలంగాణలో బిజెపి పార్టీ కి ఎదురు దెబ్బ తగలడం ఖాయమని సొంత పార్టీ నేతలే చర్చించుకోవడం, కార్యకర్తలు ఏమి చేయాలో తోచక ఆలోచనలు పడడం, పార్టీ నాయకులకు గడ్డుకాలంగానే కనిపిస్తుందని రాష్ట్రవ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసాక సర్వే రిపోర్టులు చూస్తుంటే బిజెపి పార్టీ ఈటెల రాజేందర్ కు పార్టీలో పెద్దపీట వేసిన అనుకున్న స్థాయిలో ఏ పార్టీ నుంచి కూడా నాయకులను బిజెపి పార్టీలో చేర్పించకపోవడం బిజెపి పార్టీ సీనియర్లను కాదని ఈటల రాజేందర్ కు ఎన్నికల చైర్మన్ గా ప్రకటించడంతో సత్తాలేని నాయకులకు అసెంబ్లీ టికెట్లు ఇవ్వడం ఈటెల రాజేందర్ అతి ఉత్సాహంతో రెండు స్థానాలలో పోటీ చేయడం కేసీఆర్ పై గజ్వేల్ లో ముఖ్యమంత్రిని ఓడ కొట్టాలన్న కసితో ముఖ్యమంత్రి ఎక్కడ పోటీ చేస్తే అక్కడ పోటీ చేస్తానని ప్రగల్భాలు పలకడం తన గొయ్యిని తానే తోవ్వుకున్నాడా.? అనిపిస్తుందని కార్యకర్తలు చర్చించుకోవడం చూస్తుంటే అవుననేపిస్తుంది. హుజురాబాద్ సీటు కూడా చేజారి పోతుందా.? అని కార్యకర్తలు చర్చించుకోవడం, పార్టీలో చర్చగా మారింది. పోటీ చేసిన రెండు స్థానాల్లో ఈటెల రాజేందర్ కు ఓటమి తప్పదని, పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల్లో ఈటెల కు ఓటమి తప్పదా.? ఈటెల రెండు స్థానాల్లో ఓడిపోతే బిజెపి పార్టీ పరిస్థితి ఏమిటని, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఓటమి భయంతోనే అంబర్ పేట నియోజకవర్గం నుంచి పోటీ చేయలేదని, అధిష్టానం తప్పనిసరిగా పోటీ చేయాలని ఆదేశించిన పోటీ నిరాకరించడం ఓటమిని ముందే గ్రహించి కిషన్ రెడ్డి చేతులెత్తేశాడని అంబర్ పేట లో నాయకులు, కార్యకర్తలు చర్చించుకున్నారు. చాలామంది సీనియర్ నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం బిజెపి పార్టీకి ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలింది ఓటమిపాలైతే తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీకి గడ్డుకాలం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఓటమి భయంతో కిషన్ రెడ్డి పోటీకి దూరం..

రాష్ట్ర అధ్యక్షుడు అయ్యుండి అంబర్ పేట నుంచి కిషన్ రెడ్డి పోటీ చేయకపోవడం చూస్తుంటే ముందుగానే సర్వేలు చేపించుకున్నారని అర్థమవుతుందని కార్యకర్తలు చర్చించుకోవడం అందుకు తగ్గట్టుగానే తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్ పేట నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, విజయం సాధిస్తాడనడానికి సందేహం లేదని అంబర్ పేట లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని చర్చించుకోవడం ఆశ్చర్యానికి గురివేస్తుంది,

### ఓటమికి భయపడి లక్ష్మణ్ వెనుకడుగు..

ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ను పోటీ చేయాలని అధిష్టానం చెప్పిన పోటీ చేయడానికి లక్ష్మణ్ నిరాకరించడం బిఆర్ఎస్ పార్టీ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజా సమస్యలను తీర్చడంలో ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను పార్టీ పథకాలను ప్రజలకు చేరవేయడంలో తాను ముఖ్యపాత్ర వహించడం ప్రజా సమస్యలను తెలుసుకోని పరిష్కరించడంలో తనకు సాటి ఎవరూ లేరని, ప్రజా నాయకుడిగా ముఠా గోపాల్ ను ప్రజలు ఆశీర్వదిస్తున్నారని డాక్టర్ లక్ష్మణ్ తెలుసుకొని పోటీ చేయకుండా ఉన్నాడని ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ముఠాగోపాల్ ఈ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేస్తాడని, విజయం సాధిస్తాడని ముందుగానే లక్ష్మణ్ పసిగట్టాడని అందుకనే ఎన్నికల్లో పోటీ చేయకుండా బిజెపి పార్టీ అభ్యర్థిగా పూసరాజుకు టికెట్ ఇప్పించుకున్నాడని ఓటమి చెందితే పార్టీలో తనకు విలువ తగ్గుతుందని తెలుసుకొని పోటీకు దూరంగా ఉన్నాడని ప్రజలు గుసగుసలాడుతున్నారు.

# ఎగ్జిట్ పోల్స్'లో హస్తం హవా

# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- తెలంగాణ తొలి కాంగ్రెస్ కేబినెట్'లో మంత్రులెవరు.?
- ఉత్తర తెలంగాణ నుంచి కీలక ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు - దక్షిణ తెలంగాణ నుంచి సీఎం క్యాండిడేట్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఈ మేరకు 45 రోజులుగా సాగిన ప్రచార పర్వం, అభ్యర్థుల హోరు, ఎన్నికల సంఘం విధులు, ప్రజల ఓట్లు అంతా ముగిసిపోయింది. ఇక మిగిలింది ఫలితాలే. డిసెంబర్ 3న ఎంతో ఉత్కంఠగా సాగిన ఎన్నికల రణక్షేత్రం ఫలితాలు వెల్లడికానున్నాయి. అయితే పోలింగ్ ముగిశాక వచ్చిన ఏ సర్వే అయినా, ఎగ్జిట్ పోల్ అయినా వెల్లడించింది ఒక్కటే. అదీ కాంగ్రెస్ పార్టీదే తదుపరి తెలంగాణ ప్రభుత్వం. దీంతో ఆ పార్టీ నాయకత్వంలో, శ్రేణుల్లో జోష్ కనిపిస్తుంది.

### పదేళ్ల తర్వాత గాంధీ భవన్'కు అధికార కళ..

2014 నుంచి 2023 వరకు డిసెంబర్ వరకు దాదాపు 10 ఏళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారానికి దూరమైంది. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ బీఆర్ఎస్ జోరు ముందు చిన్నబోయింది. దీంతో దశాబ్దం తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుంది. ఈ మేరకు గాంధీ భవన్ టూ ప్రగతి భవన్'కు మార్గం దాదాపుగా సుగమైనట్లేనని ఎగ్జిట్ పోల్స్ మేరకు స్పష్టం అవుతోంది.

### ప్రధాన ప్రతిపక్షంగా ఎన్నో కేసులు, నిర్బంధాలు..

తెలంగాణలో రెండు సార్లు అధికారం లేకుండా ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికార టీఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నో కేసులు ఎదుర్కొంది. మరెన్నో నిర్బంధాలను ఎదుర్కోంది. టీపీసీసీ కమిటీ నుంచి ఫిషర్ మెన్ కమిటీ వరకు, ఎన్ఎస్'యూఐ నుంచి కిసాన్ కాంగ్రెస్ వరకు అందరూ లాఠీలకు, పోలీసుల తూటాలకు ఎదురొడ్డి నిలిచినవారే. దీంతో 10 ఏళ్ల నిర్విరామ కృషి తర్వాత తెలంగాణను కాంగ్రెస్ హస్తగతం చేసుకోనుంది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో కాంగ్రెస్ క్యాడర్ సంబురాల్లో మునిగిపోయారు. పోలింగ్ అనంతరం ఆ పార్టీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి ఈ మేరకు సంబురాలు చేసుకోవచ్చని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆపడం ఎవ్వరి వల్ల కాదని, ప్రజలే కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో అధికారంలోకి తెచ్చుకుంటున్నారన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులుగా ఎంపిక అయ్యేనా.?

1. చెన్నూరు నుంచి గడ్డం వివేకానంద్, బెల్లంపల్లి - గడ్డం వినోద్
2. మంచిర్యాల - ప్రేమ్ సాగర్ రావు
3. మంథని - దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జగిత్యాల - టీ. జీవన్ రెడ్డి, కరీంనగర్ - పొన్నం
4. గ్రేటర్ హైదరాబాద్ నుంచి అంజన్ కుమార్ యాదవ్
5. అంబర్ పేట నుంచి డా.రోహిన్ రెడ్డి. మహిళల కోటాలో ఖైరతాబాద్ పి.విజయారెడ్డి, డాక్టర్ కోట నీలిమ
6. ఖమ్మం నుంచి భట్టి విక్రమార్క, తుమ్మల, పొంగులేటి,
7. కొడంగల్ - రేవంత్ రెడ్డి, అలంపూర్
   - సంపత్ కుమార్, కొల్హాపూర్ - జూపల్లి కృష్ణారావు
8. అంథోల్ నుంచి దామోదర రాజనర్సింహ
9. వరంగల్ వెస్ట్ - నాయిని రాజేందర్ రెడ్డి
10 నల్గొండ - కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, హుజుర్ నగర్ - ఉత్తమ్ కుమార్ రెడ్డి.
11. ములుగు - సీతక్క
12. సంగారెడ్డి - జగ్గారెడ్డి
13. నిజామాబాద్ - షబ్బీర్ అలీ, నాంపల్లి - ఫిరోజ్ ఖాన్
14. యాదాద్రి భువనగిరి - కుంభం అనిల్ కుమార్ రెడ్డి
15. ఎల్బీనగర్ నుంచి మధుయాష్కీ
16. మరోవైపు శాసనమండలి నుంచి టీపీసీసీ ఫిషర్ మెన్ కాంగ్రెస్ కమిటీ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, మహిళా కాంగ్రెస్ తరఫున కల్వసుజాత గుప్త, మంత్రిమండలికి ఎంపికయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయా నేతలకు కీలక బాధ్యతలు అప్పగిస్తామని, గతంలోనే రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.

# క్యూలో నిల్చొని ఓటు వేసిన చిరంజీవి, ఎన్టీఆర్, అల్లు అర్జున్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఓట్ల పండగ ప్రారంభమైంది. గురువారం (నవంబర్ 30) ఉదయం నుంచే పోలింగ్ సెంటర్ల వద్ద హడావిడి నెలకొంది. సామాన్యులతో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు క్యూ లైన్‌లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. మెగాస్టార్ చిరంజీవి, యంగ్ టైగర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, సుమంత్, సంగీత దర్శకుడు కీరవాణి తదితరులు ఇప్పటి వరకు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్ క్లబ్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు చిరంజీవి. మెగాస్టార్ వెంట ఆయన సతీమణి సురేఖ, కూతురు శ్రీజ ఉన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఓబుల్ రెడ్డి పబ్లిక్ స్కూలులో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు నటుడుఎన్టీఆర్. అందరితో పాటు క్యూలో నిలబడి మరీ ఓటు వేసిన ఎన్టీఆర్.ప్రతి ఒక్క ఓటరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అలాగే జూబ్లీహిల్స్‌లోని బీఎస్ఎన్ఎల్ పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు ప్రముఖ హీరో అల్లు అర్జున్. ఉదయం 7గంటలకే క్యూలో నిలబడి పోలింగ్ కేంద్రానికి రాగా ఈవీఎం మొరాయించింది. కాసేపు వెయిట్ చేసి ఆ తర్వాత ఓటు వేసి వెళ్లారు అల్లు అర్జున్. జూబ్లీహిల్స్ క్లబ్‌లో సుమంత్ ఓటు వేశారు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్‌లోతన ఓటు హక్కును వినియోగించారు. ఆయన వెంట కుమారుడు, ప్రముఖ సింగర్ కాల భైరవ కూడా ఉండి ఓటును వేశారు.

# బండి సంజయ్ భావోద్వేగం

- చివరి శ్వాస వరకు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. దాదాపుగా అన్ని ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ కు పట్టం కట్టగా కొన్ని ఎగ్జిట్ పోల్స్ మాత్రం బీఆర్ఎస్ కు పట్టం కట్టాయి. ఏ ఒక్క ఎగ్జిట్ పోల్ కూడా బీజేపీకి అనుకూలంగా వెలువడలేదు. పట్టుమని పది సీట్లు కూడా బీజేపీ దక్కించుకోలేదని తేల్చి చెప్పాయి. కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్యే ప్రధానంగా పోటీ నెలకొని ఉంటుందని స్పష్టం చేశాయి. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపాయి.ఈ పరిస్థితుల్లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ లోక్‌సభ సభ్యుడు బండి సంజయ్ తెర మీదికి వచ్చారు. ఎగ్జిట్ పోల్స్‌పై తన స్పందన తెలియజేశారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ అకౌంట్‌పై ఓ పోస్ట్ పెట్టారు. భావోద్వేగానికి గురయ్యారాయన. కాషాయ విజయమే లక్ష్యంగా తమ వ్యాపారాలను, ఉద్యోగాలను, కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి అహర్నిశలు కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వెన్నంటి నడిచిన యువకులు, జాతీయవాదులు, శ్రేయోభిలాషులందరికీ పేరుపేరునా ధన్యవాదాలను తెలియజేస్తోన్నానని అన్నారు. తమ పవిత్రమైన ఓటుతో కరీంనగర్‌లో కమల వికాసానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలను తెలుపుకొన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రగతి, సంక్షేమం కోసం జరిగిన శాసనసభ ఎన్నికల అంకం చివరి వరకు తమ అమూల్యమైన సేవలను అందించిన ఎన్నికల నిర్వహణ సిబ్బందికి, పోలీసు సిబ్బందికి, మీడియాకూ ధన్యవాదములు తెలిపారు. తన చివరి శ్వాస వరకు నాయకులు, కార్యకర్తలతోనే ఉంటానని హామీ ఇచ్చారు బండి సంజయ్. భారత్ మాతాకీ జై అంటూ తన ట్వీట్‌ను ముగించారు.

# గందరగోళం ఎగ్జిట్ పోల్స్

- ప్రజా నాడిని ఎవరూ పట్టలేకపోతున్నారా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఐదు రాష్ట్రాల ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎగ్జిట్ పోల్స్ వచ్చాయి. జాతీయ మీడియా చానళ్లతో పాటు తెలంగాణ ఫలితాలపై ఇప్పటి వరకూ వినని, చూడని కంపెనీలు కూడా ఫలితాలను ప్రకటించాయి. ఈ ఎగ్జిట్ పోల్స్ లో బిన్నమైన ఫలితాలు రావడం అందర్నీ ఆశ్చర్య పరుస్తోంది. ఒక్క తెలంగాణలోనే కాదు దాదాపుగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. మధ్యప్రదేశ్, రాజస్తాన్, చత్తీస్ ఘడ్‌లలో గెలుపు ఎవరిదన్న దానిపై ప్రతిష్టాత్మక సంస్థలు సైతం భిన్నమైన ఫలితాలను ప్రకటించాయి. దీంతో మూడో తేదీన కౌంటింగ్ లో వచ్చే ఫలితాలు ఊహించని షాక్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

### అందర్నీ ఆశ్చర్యపరుస్తున్న మధ్యప్రదేశ్ ఎన్నికలు

మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని చాలా కాలంగా సర్వేలు చెబుతూ వస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ లోనూ అదే చెప్పారు. కానీ రెండు, మూడు ప్రముఖ సంస్థల ఎగ్జిట్ పోల్స్ లో మాత్రం బీజేపీకి భారీ మెజార్టీ వస్తుందని అంచనా వేశాయి. ఇదే చాలా మందిని ఆశ్చర్య పరుస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధారణ మెజార్టీ సాధించినప్పటికీ జ్యోతిరాదిత్య సింధియా పార్టీ మారిపోవడంతో ప్రభుత్వం కుప్పకూలింది. బీజేపీనే మళ్లీ శివరాజ్ సింగ్ చౌహానే సీఎం అయ్యారు. కానీ ఆయన పాలనపై చాలా వ్యతిరేకత ఉందని ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో గతంలో కూడా ఎన్నడూ లేనంత మెజార్టీ బీజేపీకి రావొచ్చని అంచనా వేస్తున్నాయి. కొన్ని సంస్థలు కాంగ్రెస్ పార్టీ గెలుపునే అంచనా వేస్తున్నయి. అందుకే మధ్యప్రదేశ్ కౌంటింగ్ సంచలనంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

### రాజస్థాన్ లోనూ ఊహించని ఫలితాలను అంచనా వేస్తున్న ఎగ్జిట్ పోల్స్

రాజస్థాన్ లో ఏ ఒక్క ప్రభుత్వాన్ని రెండో సారి ఎన్నుకున్న సందర్భంగా గత ముప్పై ఏళ్లలో లేదు. పైగా కాంగ్రెస్ పార్టీలో సచిన్ పైలట్, గెహ్లోత్ మధ్య ఉన్న ఆధిపత్య పోరాటంతో కాంగ్రెస్ పార్టీ నానా తిప్పలు పడుతోంది. అందుకే పోలింగ్ కు ముందు సర్వేల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందని అంచనాలు వచ్చాయి. రాహల్ గాంధీ కూడా ఆశలు పెట్టుకోలేదు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తాము గెలుస్తామని ఆ ఒక్క రాష్ట్రం గురించే చెప్పలేదు. కానీ గట్టి పోటీ ఇస్తున్నామని మాత్రం చెప్పుకొచ్చారు. అయితే రాజస్థాన్ లో కాంగ్రెస్‌కు ఎడ్జ్ ఉందని కొన్ని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. దీంతో భిన్నమైన ఫలితాలను ఇచ్చినట్లయింది.

### తెలంగాణలో కాంగ్రెస్ కు ఎడ్జ్ ఉందని ఎగ్జిట్ పోల్స్

తెలంగాణలో దాదాపుగా అన్ని ప్రముఖ సంస్థల ఎగ్జిట్ పోల్స్ బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర ప్రజావ్యతిరేకత ఉందని అంచనా వేశాయి. అందుకే అన్ని ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందని చెప్పాయి కానీ ల్యాండ్ స్లైడ్ విక్టరీని మాత్రం చెప్పలేదు. కానీ బీఆర్ఎస్ గెలుస్తుందని కానీ బీఆర్ఎస్ విజయానికి దగ్గరగా ఉందని కానీ ఎవరూ చెప్పలేదు. కానీ కొన్ని ఎగ్జిట్ పోల్స్ హంగ్ అంచనా వేశాయి. కాంగ్రెస్ పార్టీకి 61 సీట్లు సాధిస్తేనే అధికారం వస్తుంది. కానీ బీఆర్ఎస్ పార్టీకి మాత్రం 53 సీట్లు చాలు. మజ్లిస్ పార్టీ ఎప్పుడూ రెడీగా ఉంటుంది. మజ్లిస్ సీట్లు సరిపోకపోతే బీజేపీకి లోటుపడే సీట్లు సాధిస్తే బీజేపీ ఎప్పుడూ రెడీగానే ఉంటుంది. ఎగ్జిట్ పోల్స్ సంగతి ఎలా ఉన్నా అసలు రిజల్ట్స్ మాత్రం ఎంతో దూరంలో లేవు. మరి కొన్ని గంటల్లోనే కౌంటింగ్ స్టార్ట్ అవుతుంది. కౌంటింగ్ స్టార్ట్ అయిన రెండు, మూడు గంటల్లో ట్రెండ్స్ తేలిపోతాయి. విజేతలెవరో తేలిపోతుంది. ఆ తర్వాత అసలు రాజకీయ పరిణామాలపై స్పష్టత వస్తుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588